
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 20 డిసెంబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980


నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్లు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.120	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 , కనిష్ఠం 18.4



లెక్క తేలేదెట్లా?

- భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12వేలు
- ప్రకటించిన ప్రభుత్వం
- 28న తొలి విడతగా రూ.6వేలు
- ఇప్పటి వరకు అధికారుల వద్ద రైతుల సమాచారం కరువు
- మార్గదర్శకాలు వెల్లడించని ప్రభుత్వం

చర్చ

నల్లగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12వేలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. ఎన్నికల ముందు ఇచ్చిన పలు హామీల్లో భాగంగా భూమి లేని నిరుపేదలను ఆదుకునేందుకు ఈ పథకాన్ని తీసుకువచ్చింది. అయితే ఈ పథకం విధి విధానాలను మాత్రం ప్రభుత్వం ప్రకటించలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భూమి లేని నిరుపేదలు ఎంతమంది ఉన్నారనే లెక్కలపై స్పష్టత లేదు. ఇటీవల ప్రభుత్వం కుటుంబ సమగ్ర సర్వేను నిర్వహించగా, ప్రజలు ఆస్తుల వివరాలు వెల్లడించేందుకు ముందుకురాలేదు. చాలా మంది భూములు లేవని వివరాలు నమోదు చేయించినట్టు సమాచారం. అయితే ఎవరికి భూమిలేదనే విషయం తెలుసుకునేందుకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖ లేదంటే పాన్‌కార్డు, ఆధార్‌కార్డు ఆధారంగా లెక్కలు తీయాలి. ప్రభుత్వం భూమి లేని నిరుపేదలను గుర్తించే విషయంలో కసరత్తు చేయకుండానే ఏకంగా నిధులు కేటాయిస్తామని ప్రకటించడంపై ఈ పథకం అమలుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన రొట్టెల చిన్న సైదులుకు కనీసం గుంట భూమి కూడా లేదు. తన కుటుంబంలో పెద్దలకు కూడా భూమి లేకపోవడంతో వారసత్వంగా కూడా అతడికి భూమి రాలేదు. తిప్పర్తిలోనే మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలు చేస్తున్నా, పెద్దగా పంటలు పండకపోవడంతో ఏటా అప్పులే మిగులుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12వేలు చెల్లించాలని నిర్ణయం తీసుకోవడం, మొదటి విడత ఈ నెల 28న రూ.6,000 వారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని ప్రకటించడంతో అతడు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. అయితే ఈ పథకం ఏ మేరకు అమలు అవుతుందనేది అర్థంకాని పరిస్థితి. దీంతో ఖాతాలో ఆ సొమ్ము జమ అయినప్పుడు మాత్రమే వచ్చినట్టు అని అతడు పేర్కొంటున్నాడు.

ఉమ్మడి జిల్లాలో 10లక్షల మందికి పైగా రైతులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10.50లక్షల మందికి పైగా రైతులు ఉన్నారు. అందులో నల్లగొండ జిల్లాలో 5,40,000మంది, యాదాద్రి జిల్లాలో 2లక్షల మందికి పైగా, సూర్యాపేట జిల్లాలో మూడు లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. మూడు జిల్లాల్లో కలిపి సుమారు 3.5 లక్షల మంది పైగా కౌలు రైతులు ఉన్నట్టు సమాచారం. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 33లక్షల మందికి పైగా జనాభా ఉంది. నల్లగొండ జిల్లాలో 16,18,416మంది జనాభా ఉండగా, యాదాద్రి జిల్లాలో 7,10,833మంది, సూర్యాపేట జిల్లాలో 10,99,566 జనాభా ఉంది. వీరిలో భూమిలేని రైతులు ఎంతమంది ఉన్నారనేది అధికారులు తేల్చాల్సి ఉంది. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉండి భూమి లేని వారిని గుర్తించాల్సి ఉంది. ఈ తతంగం పూర్తయ్యేది ఎప్పుడో? భూమిలేని వారికి డబ్బు జమయ్యేది ఎప్పుడో? వేచి చూడాల్సిందే.

భూమి లేని పేదల సంఖ్య ఎలా?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3.5లక్షల మందికి పైగా కౌలు రైతులు ఉన్నట్టు సమాచారం. ఈ కౌలు రైతుల్లో ఎంత మంది భూమి లేని వారు ఉన్నారనేది తేల్చడంతో పాటు అసలు భూమి లేని నిరుపేదలు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడి జీవించే వారి సంఖ్య తేల్చాల్సి ఉంది. కౌలు రైతులు భూమి లేని వారు ఉన్నా, వారికి కౌలుకు భూమి ఇచ్చిన పట్టా రైతులు కౌలు కాగితం రాసి ఇచ్చేందుకు ముందుకురారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కౌలు రైతులను, భూమిలేని నిరుపేదలను దృష్టిలో ఉంచుకుని ఏటా రూ.12వేలు చెల్లించాలంటే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి కసరత్తు చేసిన దాఖలాలు లేవు. భూమి లేని వివరాలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంతో పాటు సీపీవో (ముఖ్య ప్రణాళిక) దగ్గరగానీ, జిల్లా వ్యవసాయ అధికారుల వద్దగానీ పూర్తిస్థాయి సమాచారం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పథకం అమలు చేయడం ఎలా సాధ్యమనే అయోమయ పరిస్థితి అధికార యంత్రాంగంలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం భూమి లేని నిరుపేదలకు ఈ నెలాఖరులోగా బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని ప్రకటించడం గమనార్హం. భూమి లేని వారి సంఖ్యను తేల్చడానికి ప్రభుత్వం ఇప్పటి వరకు ఉమ్మడి అధికారులతో కమిటీలు

మిగతా 6వ పేజీలో...



'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్‌లో కార్యక్రమంలో పాల్గొన్న జేడీఏ శ్రవణ్‌కుమార్, వ్యవసాయాధికారులు

సంక్రాంతి తరువాత 'రైతు భరోసా'

- ప్రతీ రైతుకు సంక్షేమ పథకాలు
- జేడీఏ పి.శ్రవణ్ కుమార్
- కొండమల్లేపల్లి ఏవోపై రైతుల ఫిర్యాదు
- ఏవో జానకిరాములుకు షోకాజ్ జారీ
- విచారణకు అధికారిని నియమించిన జేడీఏ
- 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన

నల్లగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ తరువాత జిల్లాలోని రైతులందరికీ రైతు భరోసా నిధులు విడుదల కానున్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' గురువారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో జేడీఏతోపాటు పలువురు వ్యవసాయాధికారులు పాల్గొని రైతుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ, ప్రతీ రైతుకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ఇప్పటికే అందుతున్నాయని, త్వరలో కొత్త పథకాలు కూడా చేరుతాయన్నారు. అదేవిధంగా కొండమల్లేపల్లి ఏవో జానకిరాములుపై రైతులు ఫిర్యాదు చేయడంతో అప్పటికప్పుడే సదరు అధికారికి షోకాజ్ జారీ చేయడంతోపాటు విచారణకు ఓ అధికారిని నియమించారు. ఈ కార్యక్రమంలో కంపాసాగర్ సీనియర్ శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారులు ఎ.శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, కట్ట కీర్తి, స్టేఫీ, కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. యాసంగి సీజన్‌తో పాటు పలు అంశాలపై రైతులు అడిగిన ప్రశ్నలకు జేడీఏ, శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు.

వినోద్‌నాయక్ (కొండమల్లేపల్లి), కుర్ర కోటేష్‌నాయక్ (చింతపల్లి): కొండమల్లేపల్లి ఏవో అందుబాటులో ఉండటం లేదు. అంతేగాక గ్రామానికి రైతు వేదిక చాలా దూరంగా ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏవోకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా రైతులకు అందుబాటులో ఉండటం లేదు. రైతుల సమస్యలపై స్పందించడం లేదు.

జేడీఏ: రైతులకు అందుబాటులో ఉండని కొండమల్లేపల్లి ఏవో జానకిరాములుకు షోకాజ్ నోటీస్ జారీ చేయడంతో పాటు విచారణ కోసం సూపరింటెండెంట్ స్థాయి అధికారిని నియమిస్తాం. రైతుల సమస్యలను ఎవరు నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించేది లేదు.

మరిన్ని వివరాలు 8లో..

సైబర్ నేరాల దర్యాప్తులో

బ్యాంకర్లు సహకరించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమని, ఈ నేరాల దర్యాప్తులో బ్యాంకర్లు పోలీసులకు సహకరించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కోరారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరిగి క్యాష్‌లెష్ లావాదేవీలు జరుగుతున్న ప్రస్తుత రోజుల్లో యూపీఐ, బ్యాంకు అకౌంట్‌లను ఆధారంగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు తప్పుడు మార్గాలను ఎంచుకుని అమాయకులను మోసగిస్తున్నారన్నారు. సైబర్ నేరాల విచారణలో బాధితుల బ్యాంకు అకౌంట్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇవ్వాలన్నారు. కోర్టు అనుమతితో సైబర్ బాధితులకు చేరాల్సిన డబ్బును అకౌంట్‌లో క్రెడిట్ చేసి, ఆ అకౌంట్‌ను అన్‌ఫ్రీజింగ్ చేసి బాధితులకు అండగా నిలవాలన్నారు. బాధితులు కోల్పోయిన డబ్బు వచ్చినప్పుడే వారిలో పోలీసులపై నమ్మకం పెరుగుతుందన్నారు. ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రతీ బ్యాంకులో హైరెజల్యూషన్ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఏటీఎం సెంటర్లలో కూడా అమర్చాలని సూచించారు. సెక్యూరిటీ అలారాలు సైతం అమర్చాలన్నారు. ప్రతీ బ్యాంకు వద్ద భద్రతా సిబ్బంది 24 గంటలు ఉండేలా చూసుకోవాలన్నారు. వివిధ స్కీంల ద్వారా లోన్లు ఇప్పిస్తామని అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని, అలాంటి వారిని ముందుగానే గమనించి పోలీసులకు సమచారం ఇవ్వాలన్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానిత లింక్‌లను, యాప్ ఫైల్స్‌ను తెరవకూడదని సూచించారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 లేదా సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్‌బీ డీఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్బీ సీఐ రాఘవరావు, నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్

మల్టీజోన్-2కు అటాచ్

ఎస్పీ నివేదికతో ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ సత్యనారాయణ

నల్లగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే ఆరోపణలతో నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్ కుమార్‌ను మల్టీజోన్-2 ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపిస్తూ సదరు మహిళ భర్త ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు ఈనెల 14వ తేదీన ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్పీ విచారణ చేయించారు. అయితే ఆ విచారణలో మహిళ భర్త ఆరోపణలు వాస్తవమని తేలడంతో, ఆ నివేదికను ఎస్పీ ఉన్నతాధికారులకు నివేదించారు. ఎస్పీ నివేదిక ప్రకారం సీఐ డానియల్‌ను మల్టీజోన్-2 కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఐజీ సత్యనారాయణ గురువారం ఆదేశాలు జారీ చేశారు. కాగా, ప్రస్తుతానికి నల్లగొండ టూటౌన్ సీఐగా ఎవరికీ బాధ్యతలు అప్పగించలేదు. నేడో రేపో టూటౌన్ సీఐగా నూతన అధికారి రానున్నట్లు సమాచారం.

ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌పై ఉద్యోగులకు శిక్షణ

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ డిప్యూటీ కార్యదర్శి భవేశ్ మిశ్రా

నల్లగొండ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఐటీ టవర్ ద్వారా ఉద్యోగులకు ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ డిప్యూటీ కార్యదర్శి, ఐఏఎస్ అధికారి భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం కలెక్టర్ ఇలాత్రిపాఠితో కలిసి హైదరాబాద్ రోడ్డులోని ఐటీ టవర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటీ టవర్ చాలా బాగుందని, ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు ఉద్యోగులను గుర్తించడంతోపాటు, 20 బృందాలుగా విభజించి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించారు. ఐటీ టవర్‌లో 500మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో జపాన్‌కు చెందిన ఓ కంపెనీ తన కార్యకలాపాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. అలాగే ఐటీ టవర్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నివేదికలు త్వరితగతిన రూపొందించడమే గాక, కంప్యూటర్ పనులు సులభతరం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, ఐటీ టవర్ మేనేజర్ నాగరాజు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ ఐటీ టవర్‌ను పరిశీలించి కలెక్టర్ ఇలాత్రిపాఠి, అధికారులతో మాట్లాడుతున్న భవేశ్ మిశ్రా

మెరుగైన వైద్యసేవలు అందించాలి

(ఆంధ్రజ్యోతి, పెద్దఅడిశర్లపల్లి): గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది లేకపోవడంపై ఆరా తీశారు. అనంతరం అవుట్ పేషెంట్లు, వివిధ రకాల జబ్బులతో వస్తున్న రోగులు, ప్రసవాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళకు ఫోన్‌చేసి పేరు ఇక్కడి ఆస్పత్రిలో నమోదు చేయించుకొని వేరేచోట ఎందుకు ప్రసవం చేయించుకున్నారని కలెక్టర్ ఆరా తీశారు. స్టాఫ్‌నర్స్ లేరని తెలుసుకుని వెంటనే డిప్యూటేషన్‌పై పంపాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలోనే స్టాఫ్‌నర్స్ నివాసం ఉండేలా నివాస గృహాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అనంతరం అంగడిపేట పంచాయతీ పోతిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇంటి సర్వేను తనిఖీ చేశారు. మండలంలో సర్వే నెమ్మదిగా చేస్తున్నారని, తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఆమె వెంట గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇంటి సర్వే వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, పెద్దవూర): ఇందిరమ్మ ఇంటి సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. గురువారం మండలంలోని బట్టుగూడెం, పెద్దవూర మండల కేంద్రంలో సర్వేను ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సర్వేలో సమస్యలు ఎదురైతే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 18004251442 ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సర్వే సమయంలో దరఖాస్తుదారు అందుబాటులో లేకుంటే యాప్‌లో వివరాలు పాక్షికంగా అప్‌లోడ్ చేయాలని, దరఖాస్తుదారుకు సమాచారం ఇచ్చి వారు అందుబాటులో ఉన్నప్పుడు ఫొటో సహా పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో ఉమాదేవి, తదితరులు ఉన్నారు.

మాలమహానాడు నేతల ముందస్తు అరెస్టు

ఖండించిన నాయకులు



నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న మాలమహానాడు నాయకులు

నల్లగొండక్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ గురువారం తలపెట్టిన చలో అసెంబ్లీ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మాలమహానాడు నాయకులను పోలీసులు గురువారం అర్ధరాత్రి నుంచే అరెస్ట్ చేశారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకు నాయకుల ఇళ్లకు వెళ్లిన పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదలచేశారు. కాగా, అరెస్టులను పలువురు నాయకులు ఖండించారు. మాలమహానాడు జాతీయ స్టీరింగ్ కమిటీ మెంబర్ గోలి సైదులు, రాష్ట్ర కార్యదర్శి తెల్లమళ్ల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు బోగరి విజయ్‌కుమార్, నాయకులు కూన యాదయ్య, గండమళ్ల శ్రీనివాస్, చింతపల్లి సైదులుతో పాటు పలువురు నేతలను నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, అరెస్టయిన నాయకులకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంచి మధుసూదన్, గోలి సైదులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, ప్రాణాలను పణంగా పెట్టయినా వర్గీకరణను అడ్డుకుంటామన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు మాల నాయకులు పార్టీ జెండాలను భుజాలపై పెట్టుకుని గ్రామ, గ్రామాన ప్రచారం నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఎత్తుకున్న జెండాను దించడం కష్టమైన పనేమీ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని గుర్తించి వెంటనే వర్గీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు లింకేజీ పూర్తిచేయాలి

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

గుర్రంపోడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలకు నూరుశాతం బ్యాంకు లింకేజీలు పూర్తి చేయాలని డీఆర్డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో సెర్ప్ కార్యక్రమాలపై వీవోఏలతో సమీక్షించి స్త్రీనిధి రుణాల రికవరీ నూరుశాతం చేయాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద సంఘం సభ్యులకు పాడిగేదెలు ఇప్పించాలన్నారు. సంఘాల్లో ఉన్న సభ్యులందరికీ రుణాలు, ప్రమాద బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి



గూడూరులో సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గూడూరు గ్రామంలో సర్వేను ఆయన తనిఖీచేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా అర్హులైన పేదలను గుర్తించాలన్నారు. అనంతరం పట్టణంలోని బకల్‌వాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేశారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో గోనారెడ్డి, రాంరెడ్డితో కలిసి పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరి శర్మ, ఎంపీవో రమేష్, ఎంఈవో బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ముంబై సముద్ర తీరంలో పడవ ప్రమాదం

బీబీనగర్ యువకుడి మృతి

6

డీసీఎం బోల్తా: 200 బాయిలర్ కోళ్ల మృతి

నాగారం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి బాయిలర్ కోళ్ల రవాణా చేస్తున్న డీసీఎం బోల్తా పడి 200 కోళ్లు మృతిచెందాయి.గురువారం ఉదయం సూర్యాపేట జిల్లా నాగారం సమీపంలో మంచు కారణంగా రహదారి కనిపించకపోవడంతో మహబూబాబాద్ నుంచి జనగాంకు వెళుతున్న డీసీఎం అదుపుతప్పి బోల్తా పడింది. డీసీఎం డ్రైవరు, మరో ఇద్దకి స్వల్ప గాయాలయ్యాయి.

ట్రాక్టర్ ట్రాలీ అపహరణ

పాలకవీడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ట్రాలీ అపహరణకు గురైన ఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో జరిగింది. మండలంలోని గుడుగుంట్ల పాలెం గ్రామానికి చెందిన కుందురు భిక్షం తెలిపిన వివరాల ప్రకారం.. టీఎస్ 29 7785 నంబరు గల ట్రాక్టర్ ట్రాలీని ఇంటి ఎదుట ఈ నెల 17వ తేదీ పార్క్ చేయగా చోరీ చేశారు. మరుసటి రోజు ఉదయం బాధితుడు ట్రాలీ చోరీకి గురైనట్లు గుర్తించి గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ట్రాలీని ఇద్దరు యువకులు తీసుకువెళ్లినట్లు బాధితుడు గుర్తించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం

అడవిదేవులపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న సుమారు ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం సీత్యా తండాకు చెందిన ధనావత్ జైపాల్ తన ఆటోలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దాచేపల్లికి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం గ్రామం వద్ద ఆటోను తనిఖీ చేయగా అందులో సుమారు 6 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించినట్లు చెప్పారు. నిందితుడు జైపాల్‌ను అదుపులోకి తీసుకుని బియ్యంస్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అద్దెకు తీసుకుంటారు...చోరీ చేస్తారు

● రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టాలతో నేరాల బాట ● ఇద్దరి అరెస్టు ● రూ.30లక్షల విలువైన రెండు కార్లు, నాలుగు బైకులు స్వాధీనం



విలేకరుల సమావేశంలో కేసు వివరాలను అదనపు ఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేట క్రైం, డిసెంబరు 19, (ఆంధ్రజ్యోతి): ఇద్దరి స్నేహితులు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడంతో నష్టాలు వచ్చాయి. ఆ నష్టాలను పూడ్చుకోవడానికి నేరాల బాట పట్టారు. కార్లు, మోటర్ సైకిళ్లను అద్దెకు తీసుకుని వాటిని తనఖా పెట్టి డబ్బును ఆర్జిస్తున్నారు. ఆ నిందితులను సూర్యాపేట పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.30లక్షల విలువైన రెండు కార్లు, నాలుగు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేక రుల సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పార్వతీపురం జిల్లా బందలుప్పి గ్రామానికి చెందిన బాత ప్రసాద్ కొన్నేళ్ల నుంచి హైదరాబాద్‌లో నివసిస్తూ అక్కడే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. సికింద్రాబాద్ ప్రాంతంలోని ఇందిరమ్మనగర్‌కు చెందిన మరో రియల్ వ్యాపారి కోరపాటి నర్సింగరావుతో ప్రసాద్‌కు పరిచయం ఏర్పడి స్నేహితులుగా మారారు. ఇద్దరు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయగా నష్టాలు వచ్చాయి. దీంతో కార్లు, బైకులు అద్దెకు తీసుకుని వాటిని తనఖా పెట్టి ఆ డబ్బులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని, బైకులను నకిలీ తాళాలతో తీసి చోరీ చేసి విక్రయించాలి నిర్ణయించుకుంటారు. ఈ నేపథ్యంలో సూర్యాపేటకు చెందిన మద్రు వెంకటేశ్వర్‌రావు విజయవాడలో చదువుతున్న తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు తన ఎర్టిగా కారులో కొత్త బస్‌స్టేషన్‌కు అక్టోబరు 27న వెళ్లాడు. ఆ సమయంలో ప్రసాద్, నర్సింగరావులు విజయవాడ వెళ్లేందుకు వెంకటేశ్వర్‌రావు కారులో ఎక్కారు. మార్గమధ్యంలో కారు యజమాని ఫోన్ నెంబరును నిందితులు తీసుకుని వారి నెంబరును వెంకటేశ్వరరావుకు ఇచ్చారు. విజయవాడకు వెళ్లగానే కారును రోడ్డు పక్క వెంకటేశ్వర రావు ఆన్‌లో ఉంచి ఓ దుకాణంలో మిఠాయి కొనుగోలు చేసేందుకు వెళ్లాడు.. ఇదే అదునుగా భావించిన ప్రసాద్, నర్సింగరావులు ఆ కారుతో ఉడాయిం చారు. కారును పార్క్ చేసిన ప్రాంతానికి వెంకటేశ్వరరావు రాగా, కారు లేదు. చుట్టుపక్కల వెతికినా కారు కనబడలేదు. కారులో ఎక్కివచ్చిన ఇద్దరు వ్యక్తులకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో బాధితుడు విజయవాడలోని కుమార్తె వద్దకు వెళ్లి అక్కడి నుంచి సూర్యాపేటకు చేరుకున్నాడు. అప్పటి నుంచి అనారోగ్యం బారిన పడ్డాడు. ఆ తర్వాత 20రోజులకు కొద్దిగా కోలుకోవడంతో ఈ విషయమై ఈ నెల 16న సూర్యాపేట పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి కేసే నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 18న సూర్యాపేట పట్టణ పోలీసులు సూర్యాపేట కొత్త బస్‌స్టేషన్ ప్రాంతంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా ప్రసాద్, నర్సింగరావులు అనుమానాస్పదంగా కనపడ్డారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. పార్కింగ్ చేసిన బైక్‌లను నకిలీ తాళాలతో చోరీ చేయడంతో పాటు కార్లను అద్దెకు తీసుకుని, మార్గమధ్యంలో డ్రైవర్‌తో కలిసి మద్యం తాగి, డ్రైవర్ మత్తులోకి వెళ్లగానే ఆ కారును అపహరించి ఇతరుల వద్ద తనఖా పెట్టి డబ్బులు తీసుకుంటున్నట్లు అంగీకరించారు. ఇదేవిధంగా సూర్యాపేటకు చెందిన వెంకటేశ్వర్‌రావు ఎర్టిగా కారుతో పాటు ఇతర ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఇన్నోవా కారు, నాలుగు బైకులను చోరీ చేసినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి రెండు కార్లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకుని, ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. నిందితుడు ప్రసాద్‌పై విశాఖపట్నం పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే రెండు చోరీ కేసులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

వృత్తి కూలీ.. ప్రవృత్తి చోరీలు

● వ్యసనాలకు అలవాటుపడి దొంగతనాలు
● నిందితుడి అరెస్టు ● 12బైకులు స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలతో సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు

సూర్యాపేట క్రైం, ఆంధ్రజ్యోతి: అతడు వృత్తి రీత్యా కూలీ.. వ్యసనాలకు అలవాటు పడి బైకులను చోరీ చేసి, వాటిని విక్రయిస్తూ జల్సాగా గడుపుతు న్నాడు.. ఈ నిందితుడిని సూర్యాపేట పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను జిల్లా పోలీస్ కేంద్ర కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన గునగంటి శ్రీకాంత్ వ్యవసాయ కూలీ. వ్యసనాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలని బైక్‌లను చోరీ చేసి విక్రయించడం ప్రారంభించారు. సూర్యాపేట పట్టణ పోలీసులు కొత్త బస్‌స్టేషన్ ప్రాంతంలో ఈ నెల 18న వాహనాలు తనిఖీలు చేస్తుండగా, నెంబరు లేని వాహనంపై శ్రీకాంత్ వచ్చాడు. పోలీసులు శ్రీకాంత్‌ను ఆపి బైక్ కాగితాలు చూపాలని కోరారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానంతో పోలీసులు అతడిని ఆదుపులోకి తీసుకుని విచారించారు. కొంతకాలం నుంచి సూర్యాపేట పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఇళ్లు, విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్ ఎదుట పార్క్ చేసిన బైక్‌లను నకిలీ తాళాలతో తీసి చోరీ చేస్తున్నట్లు అంగీకరించాడు. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి, 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పై రెండు కేసుల్లో కార్లు, బైకులు చోరీ చేస్తున్న ముగ్గురిని చాకచక్యంగా అరెస్టు చేసిన సూర్యాపేట పట్టణ పోలీసులను ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ పి.వీరరాఘవులు, పట్టణ ఎస్‌ఐలు ఆంజనేయులు, యాట సైదులు, సిబ్బంది గొర్ల కృష్ణయ్య, గోదేశి కర్ణాకర్, జోగు సైదులు, శివ, సుధాకర్, రవి, చీకూరి మధు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడల్లో రాష్ట్రస్థాయికి వెలిమినేడు విద్యార్థులు

● వాలీబాల్ క్రీడలో జిల్లాస్థాయిలో ప్రథమస్థానం



వెలిమినేడులో సీఎం కప్ క్రీడల్లో జ్ఞాపికను ప్రదర్శిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

చిట్యాలరూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ప్రజా పరిపాలన దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీలో ప్రథమ స్థానాన్ని సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనారు. వాలీబాల్ పోటీలో నల్లగొండ జిల్లా టీం తరఫున ఆడిన వెలిమినేడు విద్యార్థులు కూరాకుల యశ్వంత్, దండు వివేక్, గుండ్లపల్లి మధు ప్రతిభను కనబరిచారు. విద్యార్థుల ప్రతిభను చూపగా వెలిమినేడు విద్యార్థులను జిల్లాస్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించారు. విద్యార్థులకు ప్రథమ బహుమతిగా న్యాయనిర్ణేతలు జ్ఞాపికను అందజేసి అభినందించారు. విద్యార్థుల ఆటతీరును పరిశీలించిన న్యాయనిర్ణేతలు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపికైనారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ఈనెల 21వ తేదీన జరుగనున్న పోటీలో వెలిమినేడు విద్యార్థులు పాల్గొననున్నారు. గ్రామానికి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించి బహుమతిని సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనందున వెలిమినేడు గ్రంథాలయ సమాచార కేంద్రం చైర్మన్ దేశబోయిన నర్సింహ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు,

అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపిక



రాజాపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన ఎం.రేవంత్ నాయక్ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. భువనగిరిలో నిర్వహించిన ప్రజాపాలన సీఎం కప్ క్రీడల్లో 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికయ్యారు. ఆయనను గ్రామస్థులు గురువారం అభినందించారు.

వలిగొండ విద్యార్థి కేరళ ట్రెక్కింగ్ క్యాంపునకు ఎన్నిక



వలిగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బండారి చంద్రశేఖర్ కేరళ ట్రెక్కింగ్ క్యాంపుకు ఎంపికయ్యాడు. డిసెంబరు 21 నుంచి 28 వరకు కేరళ రాష్ట్రంలో జరిగే ఎన్‌సీసీ కేరళ ట్రెక్కింగ్ క్యాంపులో పాల్గొననున్నాడు. చంద్రశేఖర్ 31 ఎన్‌సీసీ బెటాలియన్ నల్లగొండ నుండి ప్రాతినిత్యం వహించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్‌కుమార్ ఎన్‌సీసీ కేర్‌టెకర్ కొంపెల్లి సురేష్, అధ్యాపకులు విద్యార్థులు అభినందనాలు తెలిపారు.

టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయికి ఎన్నారం విద్యార్థిని

రామన్నపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో జరిగిన బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రామన్నపేట యన్నారం ప్రభుత్వ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని బండమీది సిరి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. గురువారం జరిగిన బయోసైన్స్ పోటీల్లో ఆమె ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా డీఈవో చేతుల మీదుగా ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు రత్నమాల తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినికి పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జంగయ్య, ఉపాధ్యాయులు జహంగీర్, జగదీశ్వర్‌చారి, విష్ణు, విజయ, ప్రతాప్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు లచ్చిరాంకు పోస్ట్‌ద్వారా పుస్తకాలు

మర్రిగూడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామెర బీమనపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఉదావత్ లచ్చిరాం గురువారం నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా వారి రూ.10వేలు విలువ చేసే పుస్తకాలను పోస్టు ద్వారా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా వారు తనకు అందించిన పుస్తకాలను మండలంలోని వివిధ పాఠశాలలకు అందజేస్తానని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారికి జిల్లా విద్యాధికారి బొల్లారం భిక్షపతి, విద్యాశాఖ కార్యాలయం సిబ్బంది, మండల విద్యాధికారి బిట్టు శ్రీను, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల కళా శ్రీనివాస్, మాలతి, శారద, కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీ చరణ్, జిల్లా మండలాలలోని వివిధ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

నార్కట్‌పల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం పోరాడుతోందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్రా శేఖర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో ఈనెల 28 నుంచి 30వ వరకు నిర్వహించే టీఎస్‌యూటీఎఫ్ ఆరవ రాష్ట్ర వైజ్ఞానిక సదస్సుతో పాటు టీఎస్‌యూటీఎఫ్ దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం నార్కట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డీ.రాములు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అరుణ, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, ఆదినారాయణ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

లెక్క తేలేదెట్లా?

(5వ పేజీ తరువాయి): ఏర్పాటుచేసిన దాఖాలాలు లేవు. గతంలో రైతుబంధు జమ చేసిన సందర్భంలో కౌలు రైతులు, పట్టదారులకు మధ్య వివాదాలు నెలకొన్నాయి. రైతుబంధు వస్తున్నందున కౌలు తగ్గించాలని, లేదంటే రైతుబంధులో కొంత నగదు ఇవ్వాలనే వివాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో కౌలు రైతులను, భూమి లేని నిరుపేదలను ఎలా గుర్తించి నగదు చెల్లిస్తారో తేలియడం లేదు.

28న తొలి విడత చెల్లించేనా?

ఈనెలా 28వ తేదీన భూమిలేని నిరుపేదల ఖాతాల్లో తొలి విడతగా రూ.6వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సంవత్సరానికి రూ.12వేలు జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం తొలుత రూ.6వేలను చెల్లించి, రెండో విడత మిగతా సొమ్మును అంటే మరో రూ.6వేలు చెల్లించనుంది. అయితే తొలి విడత రూ.6వేలు ఈనెలా 28వ తేదీన జమ అవుతాయా? లేదా? అనే దానిపై ఇప్పటి వరకు మార్గదర్శకాలు లేవు. అధికారుల వద్ద కూడా ఎలాంటి సమాచారం లేదు. దీంతో ఈ పథకాన్ని ప్రభుత్వం ఎలా ముందుకు తీసుకెళ్తుందనేది తేలాల్సి ఉంది. ఈ పథకం అమలు కోసం గ్రామీణ ప్రాంతాల్లో వార్డు సభలు నిర్వహించి భూమి లేని నిరుపేదలను గుర్తించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయి ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలం కూడా పూర్తయింది. ఇప్పటికే ప్రత్యేక అధికారులంతా పనిభారంతో సతమతమవుతున్నారు. ఈ సమయంలో భూమి లేని నిరుపేదల సంఖ్య తేల్చడానికి త్వరితగతిన సమావేశాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. తొలి విడత నిధులు చెల్లించడానికి కేవలం తొమ్మిది రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ నేపథ్యంలో భూమిలేని లబ్ధిదారుల సంఖ్యను ఎలా గుర్తిస్తారు? ఎలా పరిగణనలోకి తీసుకుంటారో తెలియదు. ఈ విషయమై నల్లగొండ సీపీవో వెంకటేశ్వర్లును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ప్రస్తుతం తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని, భూమి లేని నిరుపేదల సంఖ్య కూడా అందుబాటులో లేదన్నారు. ప్రభుత్వం జనాభా లెక్కల ఆధారంగా గుర్తిస్తుందా? లేదా? అనే దానిపై మార్గదర్శకాలు రాగానే సమాచారం సేకరిస్తామన్నారు. ఒకటి, రెండు రోజుల్లో భూమి లేని నిరుపేదల సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు.

1.3కిలోల గంజాయి స్వాధీనం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ, పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అరెస్ట్ చేసి 1.3 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన సిరికొండ భానుప్రకాష్ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం పట్టణంలోని చైతన్యనగర్ బోటింగ్ పార్కు వద్ద గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు వెళ్లగా చేతిలో సంచితో పారిపోతున్న యువకుడిని పట్టుకుని విచా రించినట్లు తెలిపారు. అయితే కోదాడలో ఇంజినీరింగ్ చేసే సమయంలో కోదాడకు చెందిన అఖిల్, డేంజర్ రాఘవులకు పరిచయమయ్యాడు ఇరువురితో కలిసి ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని కర్మనూరు గ్రామంలో గంజాయి కొనుగోలు చేసి చిన్న చిన్న పొట్లాలుగా కట్టి హైదరాబాద్, మిర్యాలగూడ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. దీంతో అదే ఊరికి వెళ్లి మరో వ్యక్తి వద్ద 2.5 కిలోల గంజాయిని కొనుగోలు చేసి కొంత విక్రయించి, మరికొంత అమీనాబాద్‌లోని తన నివాసంలో దాచి పెట్టి, మరి కొంత విక్రయించేందుకు పట్టణానికి వచ్చిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అఖిల్ రాఘవులు పరారీలో ఉన్నారు. నిందితుడు నుంచి 1.3 కిలోల గంజాయితో పాటు రూ. 2,400 నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐలు నాగార్జున, కరుణాకర్, సిబ్బంది సుధీర్‌కుమార్, వెంకటేశ్వర్లు, వీరబాబు, నరసింహ, తమీజుద్దీన్ పాల్గొన్నారు.

ముంబై సముద్ర తీరంలో పడవ ప్రమాదం

● ఫెర్రీని ఢీకొట్టిన ప్రమాదంలో బీబీనగర్ యువకుడి మృతి
● 'నేవీ స్పీడ్ బోట్' ఘటనతో యాదాద్రి భువనగిరి జిల్లాలో విషాదం



ప్రవీణ్‌కుమార్ శర్మ (ఫైల్ ఫొటో)

బీబీనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముంబై సముద్ర తీరంలో జరిగిన ప్రమాదంలో యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌కు చెందిన యువకుడు ప్రవీణ్‌కుమార్‌శర్మ(34) మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన రామునాథ్ శర్మ నాలుగు దశాబ్దాల క్రితం భార్యతో కలిసి బీబీనగర్‌కు ఉపాధి రీత్యా వలస వచ్చాడు. స్థానికంగా ఉన్న వైబ్రా కంపెనీలో ఉద్యోగిగా చేరి కుటుంబాన్ని పోషించుకునేవాడు. రామునాథ్‌శర్మకు ముగ్గురు సంతానం కాగా, పెద్ద కుమారుడు మున్నా మండల కేంద్రంలో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తుండగా రెండో కుమారుడు ప్రవీణ్‌కుమార్ శర్మ ముంబైలో బోట్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. కుమార్తె లక్ష్మికి వివాహమైంది. రామునాథ్‌శర్మ మూడు నెలల క్రితం మృతిచెందాడు. బుధవారం నేవీకి చెందిన స్పీడ్ బోటుకు కొత్త ఇంజన్ బిగించి ముంబైలోని సముద్ర తీరంలో ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా సాంకేతిక సమస్య తలెత్తి బోటు అదుపు తప్పింది. ప్రవీణ్‌కుమార్‌శర్మ ప్రయాణిస్తున్న బోటులో ఆరుగురు ఉన్నారు. ఇదే సమయంలో గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి ఎలిఫెంటా దీవులకు ప్రయాణికులతో వెళుతున్న ఫెర్రిని(నీల్ కమల్, నావ) వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మొత్తం 13మంది మృతి చెందగా, నేవీ స్పీడ్ బోటులో ఉన్న ప్రవీణ్‌కుమార్ శర్మ అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని బీబీనగర్ తీసుకువచ్చేందుకు కుటుంబసభ్యులు గురువారం ముంబై బయలుదేరారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

అనంతగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామశివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేలుడు పదార్థాల పట్టివేత

వలిగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌కు ఉపయోగించే పేలుడు పదార్థాలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పులిగిల్ల గ్రామ శివారులో బ్లాస్టింగ్ కోసం గుంతలు తవ్వుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేయగా, వరికుప్పల వెంకటేశం, పైళ్ల రమణారెడ్డి, శివరాత్రి వెంకటేశ్‌లు బ్లాస్టింగ్ కోసం గుంతలు తవ్వుతున్నారు. వారి వద్దనుంచి 10జిలెటన్ స్టిక్స్, 48 డిటోనేటర్లు, ఒక మెగ్గర్ బాక్స్, రెండు బైండింగ్ కేబుల్ బండల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

31 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

వలిగొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని టేకులసోమారం గ్రామానికి చెందిన వ్యాపారి వెంకటేష్ అక్రమంగా రేషన్ బియ్యన్ని నిల్వచేసినట్లు విశ్వసనీయమైన సమాచారం మేరకు అధికారులు దాడులుచేశారు. 31క్వింటాళ్ల రేషన్ బియ్యన్ని పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో ఆటో డ్రైవర్ బలవన్మరణం

రామన్నపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో మనస్తాపంతో ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నీర్నెంల గ్రామానికి చెందిన నోముల స్వామి (36) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. స్వామికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ తగాదాలు ఏర్పడుతున్న నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి : డీఎస్‌వో



చామలేడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో

గుర్రంపోడు, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పౌరసంఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మేనేజర్ హరీష్ సూచించారు. మండలంలోని చా మలేడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీ లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు లు ధాన్యాన్ని శుభ్రం చేసి కేంద్రాలకు తీసుకు రావాల న్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనం తరం గుర్రంపోడులో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. వారి వెంట సివిల్ సప్లై ఆర్‌ఐ రావుల సైదులుగౌడ్ ఉన్నారు.

వందేళ్ల పండగను విజయవంతం చేయాలి



దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య నాయక్

దేవరకొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ వంద సంవత్సరాల ఉత్సవాలను విజ యవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రమావత్ అంజయ్య నాయక్ కోరారు. మండలంలోని రేగళ్లతండాలో గురువారం నిర్వ హించిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయ న పాల్గొని మాట్లాడారు. ఈ నెల 26నాటికి సీపీఐ వంద సంవత్సరాల్లోకి అడుగు పెడుతుం దని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన సీపీఐ పోరాడుతుందని అన్నారు. 100 సంవత్సరాల ఉత్సవాలని వాడ వాడలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో దేవరకొండ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, వెంకటరామ్, పాండు, జగన్, తిరుపతి, వినోద్ పాల్గొన్నారు.

● మిర్యాలగూడటౌన్-(ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల పండగను ఘనంగా జరుపుకోవాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు బంటు వెంక టేశ్వర్లు పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భవించి ఈ నెల 26నాటికి వందేళ్లు నిండుతున్న సంద ర్భంలో జిల్లా కేంద్రంలో భారీ బహిరంగసభ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయ కు లు, కార్యకర్తలు, విద్యార్థి మహిళ సంఘ నేతలు బహిరంగసభకు భారీగా తరలి రావా లని పిలుపునిచ్చారు. అనంతరం సభ పోస్టర్లు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎండీ. సయీద్, ధీరావత్ లింగా నాయక్, వలంపట్ల వెంకన్న, ఎరబోతు పద్మ, ఎస్‌కే. సేమియా, అంజమ పాల్గొన్నారు.

అర్హులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తాం



సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి జానారెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్,

నాగార్జునసాగర్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలో దరణి పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన భూ సర్వే ఆధారంగా వారం రోజుల్లో అర్హులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందజే స్తామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీ విజయవిహార్ అతిథి గృహంలో బోర్డు రూమ్‌లో సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సర్వే జరిగిన తీరును, ఎంత మేరకు సర్వే పూర్తయింది అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన సర్వే ఈ నెల 25న తుని నూతల గ్రామంలో మిగిలిన భూ సర్వే పూర్తవుతుందన్నారు. ఈ సర్వేలో ప్రభుత్వ, అటవీ, ఈపీ ల్యాండ్స్ సర్వే చేయిం చామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, చందూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, ఏడీ శ్రీనివాస్, డిప్యూటీ సర్వేయర్ రమణయ్య, రమాకాంత్, వేణుగోపాల్, చంద్రారెడ్డి, తహసీల్దార్లు కృష్ణయ్య, దశరథ, అనిల్ పాల్గొన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	578.30
టీఎంసీలు	278.1082
ఎడమకాల్వకు నీటి విడుదల	8280
కుడికాల్వకు	8067
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	35,315
అవుట్‌ఫ్లో	49,305 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.23అడుగులు
టీఎంసీలు	4.28
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్ ఫ్లో	61.88 క్యూసెక్కులు

చిరు ధాన్యం.. సంపూర్ణ ఆరోగ్యం

● చిరుధాన్యాల వాడకంపై ప్రజల ఆసక్తి ● మందు బిళ్ల వాడే బదులు ముందు జాగ్రత్త మేలనే భావన ● పట్టణంలో విస్తరిస్తున్న 'చిరు' వ్యాపారం.. అందుబాటులో స్టాల్స్



నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల ఎదుట ఏర్పాటైన చద్దన్నం స్టాల్

ఉరుకులు పరుగుల జీవితం.. మారుతున్న జీవన శైలి ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూనే మిత ఆహారానికి మారుతున్నారు. చిరుధాన్యాల ఆహారంతో ఎన్నో ప్రయోజనాలు ఉండడంతో వాటి వాడకంపై ప్రజలు ఆసక్తి చూపుతు న్నారు. అనారోగ్యం బారిన పడి మందు బిళ్లలు వాడే బదులు వాటిని దరి చేరకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమమని భావిస్తున్నారు. అందుకే చిరు ధాన్యాలతో చేసిన ఆహార పదార్థాల వైపు మొగ్గు చూపుతున్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో చిరు ధాన్యాల తో తయారు చేసిన ఆహార పదార్థాలు కొందరికి ఉపాధిని కూడా ఇస్తున్నాయి. పట్టణంలోని వివిధ కూడళ్లలో స్టాల్స్ ఏర్పాటు చేసి ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ టౌన్)

చిరు ధాన్యాల వాడకం పెరుగుతోంది. వరి, గోధుమలతో చేసిన ఆహారంలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఆ ఆహారాన్ని తగ్గించి రాగులు, జొన్నలు, సజ్జలు, సాములు, ఊదలు, కొర్రలు, అరికలు తదితర చిరుధాన్యాల ఆహారం తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాగిముద్ద, జొన్నరొట్టెలు, రాగి రొట్టెలు, సద్ద రొట్టెలు తీసుకుంటూ ఆనారోగ్య సమస్యలకు దూరంగా ఉంటున్నారు. గతంలో పట్టణాల్లో ఎక్కడో ఓ చోట చిరుధాన్యాలకు సంబంధించిన స్టాల్స్ కన్పించేవి. ప్రస్తుతం అనేక హోటళ్లు కూడా ప్రత్యేక



చిరుధాన్యాల వంటకాలు అందిస్తున్నాయి. పెద్దపెద్ద హోటళ్లలో ఈ వంటకాలు తప్పనిసరిగా మెనూలో చేర్చుతున్నారు. రాగి ఇడ్లీ, జొన్న ఇడ్లీ, ఊదల ఇడ్లీ, మిల్లెట్ పెరుగన్నం, జొన్న రవ్వ పొంగలి, మిల్లెట్ పెసరట్టు, మిల్లెట్ బిస్మిల్లాబాత్, మిల్లెట్ కిచిడి, ఉప్మా, దోసె, మల్టీగ్రేన్ చపాతి, అందుబాటులో ఉంటున్నాయి. ఊదలు, అరికెలు, రాగి, జొన్న, అండుకొర్రలుతో తయారు చేసిన ఇడ్లీలు, పొంగల్, దోసె, ఉప్మా, చపాతీ, పూరి అం దిస్తు న్నారు. స్వీట్ల దుకా ణాల్లోనూ రాగి లడ్డు, మిల్లెట్ లడ్డు, నువ్వుల లడ్డు, రాగి బిస్కెట్, జొన్న బిస్కెట్ తదితర చిరు తిండ్లపై ఆసక్తి చూపుతు న్నారు. గంజి, పులావు, బాదం ఖీర్, ఉప్మా, కిచిడి, పులిహోర, కట్ లెట్, వెజిటేబుల్ బి యాని, పకోడి, బజ్జీ, పాయసం, బర్ఫీ, సమోసా, లడ్డూ, పునుగులు, వడియాలు, పులగం, కట్లెట్, రోటీ, గారె లు, మంచూరి యాసాక్స్ చిరు ధాన్యా లతో తయారు చేసి అందిస్తు న్నారు.

మితఆహారం..

40ఏళ్ల వయసు నుంచే వచ్చిపడుతున్న వివిధ రకాల వ్యాధులు ప్రజల ఆహారపు అలవాట్లను మార్చేలా చేస్తు న్నాయి. రెండు పూటలా భోజనం చేసే వారు ఇప్పుడు ఒక్క పూట భోజనానికే పరిమితమ వుతున్నారు. ఉదయం, సాయంత్రం కొర్రలు, రాగులు, అరికెలు, ఊదలు, జొన్నలు, వరిగెలు వంటి వాటితో చేసిన ఆహార పదార్థాలు తీసుకుంటున్నారు.

చిరు ధాన్యాల అడ్డా.. నల్లగొండ ఎన్జీ కళాశాల

పట్టణంలోని నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానానికి రోజూ ఉదయం వాకింగ్, వ్యాయామం, క్రీడలు ఆడేందుకు రోజూ పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారు ఆర్గానిక్‌తో చేసిన పదార్థాలు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అక్కడే ఈ చిరుధాన్యాలతో చేసిన ఆహారపదార్థాలు అందుబాటులో ఉండడంతో కొనుగోలు చేస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పోషక విలువలు కలిగిన పదార్థాలతో తయారు చేసిన వివిధ రకాల ఫుడ్స్, జ్యూస్, టీ దుకాణాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

ఆరోగ్యంగా ఉండగలుగుతున్నాం



మిల్లెట్స్ వాడకంతో ఎంతో ఉపయోగంగా ఉంటుంది. రసాయనాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ప్రజలు అనేక రుగ్మతలకు గురైయ్యే లక్షలాది రూపా యలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రస్తుతం నిజ జీవితంలో చిరుధాన్యాలను చేర్చుకోవడం తప్పనిసరిగా మారింది.

కె. సాయిసుధ

అందుబాటులో ధరలు



చిరుధాన్యాలతో చేసే ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటున్నాయి. హెర్బల్ టీని వాకర్స్ ఎక్కువగా సేవిస్తున్నారు. దీని ధర రూ.20గా విక్రయిస్తున్నారు. పోషక విలువలు కలిగిన పదార్థాలతో తయారు చేసిన రాగి జావ, జొన్న సంకటి వంటి వాటితో పాటు చద్దన్నం కూడా లభిస్తున్నాయి. రూ.30లకే లభిస్తుంది. ఎన్జీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌వద్ద ప్రతిరోజూ సుమారు 300 మంది వరకు వివిధ రకాల మిల్లెట్స్ తీసుకుంటున్నారు

చద్దన్నం తినేందుకు ఆసక్తి..



ప్రజలు చాలా మంది ఎక్కువగా చద్దన్నం తింటున్నారు. పట్టణాల్లో కొందరు తమ ఇళ్లలో రాత్రి మిగిలిన అన్నంలో పాలు పోసి తోడు వేసుకొని ఉదయం అల్పాహారంగా తీసుకుంటారు. మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా చద్దన్నం అమ్మేందుకు స్టాల్ కూడా ఏర్పాటైంది. ఎన్జీ కళాశాల ఎదుట రెండు చద్దన్నం స్టాళ్లు వెలిశాయి. జొన్నలు, బ్రౌన్‌రైస్ అరికెలు, సజ్జలు ఇలా అనేక రకాల చద్దన్నం తయారు చేసి విక్రయిస్తున్నారు.

పేద రైతులకు అండగా 'భూ భారతి'

కేతేపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన భూ భారతి పేద రైతులకు అండగా ఉంటుం దని టీపీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి అన్నారు. నల్ల గొండ జిల్లా కేతేపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలకులు అమలు చేసిన ధరణి పోర్టల్‌తో రైతులు తీవ్ర అన్యాయాలకు గురయ్యారని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని రైతుల భూహక్కుల రక్షణకు ప్రభుత్వం భూభారతిని అమల్లోకి తెచ్చిందన్నారు. ఏడాదికే భూ భారతిని అమ ల్లోకి తెచ్చిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

అసెంబ్లీలో మన గళం..

నిధుల విడుదలపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నార్కట్‌పల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని చిట్యాల, రామన్నపేట, నార్కట్ పల్లి మండలాలకు సాగునీటిని అందించే పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వల పూర్తికోసం రూ.224కోట్లు మంజూ రు చేస్తూ జీవో జారీ చేయడంపై నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. చిన్ననీటి పారుదల కాల్వలు పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వను పూర్తిచేసేందుకు నిధులు విడుదల చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం కాల్వల నిర్మాణానికి మంత్రి రూ.35 కోట్లు ఇచ్చారని ఇంకా రూ.70 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

'ఎర్రపహాడ్' రైతులకు పట్టాలివ్వాలి

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



మోత్కూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నూతన కల్ మండలం ఎర్రపహాడ్ గ్రామంలో దొరల వద్ద సన్న, చిన్నకారు రైతులు సుమారు 60 ఏళ్ల క్రితం 2,300 ఎక రాల భూములు కొనుగోలు చేశారని, వారికి ఇంతవరకు పట్టాలు లేవని, వారికి పట్టాలు ఇవ్వాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. ఇప్పటికీ ఆ భూములు రైతుల కబ్జాలోనే ఉన్నాయన్నారు. అసంపూర్తిగా ఉన్న బునాదిగాని కాల్వ, కేతిరెడ్డి కాల్వల నిర్మాణానికి తన విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సింధు భాగోతం ఆడేవారిలో వేషాలు(పాత్రలు) వేయడా నికి తగినంత మంది ఉండకపోవడంతో ఒక వేషం అయిపోగానే మరో వేషం వేస్తూ ఒక్కొక్కరు మూడు రకాల వేషాలు వేస్తారని, ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రోజుకో వేషం వేస్తున్నారని విమర్శించారు.

సాగు నీటి కాల్వలను పూర్తిచేయాలి


● భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి



భువనగిరి రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి నియోజకవ ర్గంలో చిన్న నీటి వనరులకు నిధులు మంజూరు చేసి, సాగు నీటి కాల్వలను త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగు నీరు అందించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కు మార్‌రెడ్డి కోరారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించి మూసీ మురికి నీళ్లతో సాగు నీటి వ్యవసాయం చేస్తున్నారని మూసీ మురుగు నీరు బదులు రైతులకు సాగు నీరు అందించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపారు. సత్వరమే బునాదిగాని కాల్వ నిర్మాణానికి రూ. 269కోట్లు మంజూరు చేశారని దాంతో పాటుగా ధర్మారెడ్డి కాల్వకు రూ.126కోట్లు, పిలాయిపల్లి కాల్వకు రూ.86కోట్లు మంజూరు చేసినందుకు సీఎం , ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్కకు కృతజ్ఞతలు తెలిపారు. బీఎన్‌తిమ్మాపురం నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వం నిధులు కేటాయించాలని, ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నిర్వాసితులకు కేటాయించిన ఇంటి స్థలాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కాగా భువనగిరి శివారు ప్రాంత మైన బైపాస్ రోడ్డులోని జాతీయ రహదారిపై బస్వాపురం ఫీడర్ ఛానల్ కాల్వ వెళుతుందని, నాగిరెడ్డిపల్లి శివారులోని నల్లగొండ ప్రధాన రహదారి వద్ద అసంపూర్తిగా ఉన్న ఫీడర్ ఛానల్ (కాల్వలకు) నిధులు మంజూరు చేసి సాగు నీరు అందించాలన్నారు.

పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయాలి

● శాసనమండలిలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



నాగార్జునసాగర్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): నాగా ర్జునసాగర్‌ను మరింత పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి కోరారు. శాసన మండలి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నాగార్జున సాగర్‌లో పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు లు కనీసం పచ్చగడ్డి కూడా లేకుండా ఆనవాళ్లు కోల్పోయాయని పేర్కొ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకంపై తీసుకుంటున్న పాలసీని స్వాగతిస్తున్నామన్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి టూ రిజం ప్రదేశాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నాగార్జునసాగర్ టైగర్ జోన్‌-ఫ్ కిలోమీటర్ల దూరంలో స్థలం ఉందని, ఆ స్థలంలో మరి న్ని సదుపాయాలు కల్పిస్తే పర్యాటకులు పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో సాగర్‌లో నెహ్రూ పార్కు నాడు ఏర్పాటు చేశారు కానీ నేడు అది ఆన వాళ్లు కోల్పోయిందన్నారు. అంతేకాకుండా సాగర్‌లో కనీసం ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మించాలన్నారు. పర్యాటక శాఖ అధికారులు సాగర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేదిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

యాదగిరికొండపై నిత్య పూజల కోలాహలం

భువనగిరి అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో నిత్యకైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలం కరించి వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవ మూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొ లిపిన అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలి ంగేశ్వర స్వామికి నిత్యపూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా రూ. 15,19,088 ఆదాయం ఆలయ ఖజానాకు సమా కూరిందని ఈవో భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా కొనసాగాయి.

మఠంపల్లి, (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం



స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అర్చకులు భక్తి శ్రద్ధలతో కనుల పండువగా నిర్వహించారు. స్వామి వారి నిజరూప అభిషేకములు, నిత్య పూజల అనంతరం రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత, నరసింహుడికి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమం లో ఆలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభచార్యులు, లక్ష్మీనరసింహామూర్తి, ఆంజనేయ చార్యులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

హాలియా, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం పరిష్కరించాలని పెన్షనర్స్ సంఘం రాష్ట్ర సంఘం అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి కోరారు. గురువారం జాతీయ పెన్షనర్స్ డేను స్థానిక పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా పెన్షనర్స్ డే ప్రాముఖ్యత గురించి వివరించి సామాజిక సేవలో భాగంగా తమ వంతుగా చేసిన సేవల గురించి వివరించారు. అలాగే పెన్షనర్లు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొ ంటున్నారని, ఈహెచ్ఎస్ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను అమలు చేస్తూ పెన్షనర్లకు అన్ని కార్పొరేట్ దవాఖానల్లో నగదు రహిత వైద్యం అమలు చేయాలని కోరారు. అనంతరం సీనియర్ పెన్షనర్లు యాదగిరి, పుల్లయ్య, కంచర్ల భాస్కర్‌రెడ్డి, వెంకటే శ్వర్లు, గోనియానాయక్, సత్తయ్య, విజయలక్ష్మిన ఘనంగా సన్మానించారు. పి.పాండరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సంఘం వెంకట్‌రెడ్డి, శ్రీశైలం,



పెన్షనర్లను సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకుడు దామోదర్‌రెడ్డి

యుగేందర్‌రెడ్డి, ఆంజనేయులు, రంగయ్య, పుల్లారెడ్డి, రామలింగయ్య, అన్మిరెడ్డి, వెంకటేశం, రాములు, కేశవరెడ్డి, నర్సింహారెడ్డి, నారాయణరెడ్డి, నర్సయ్య. రవీందర్‌రెడ్డి, దైవజ్ఞాచారి పాల్గొన్నారు.

శివాలయంలో నాగుపాముకు పూజలు

సూర్యాపేట జిల్లా కోదాడలో ఘటన

కోదాడ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడలోని శివాలయంలో గర్భగుడిలోకి నాగుపాము వెళ్లగా అర్చకుడు పూజలు చేశారు. గురువారం ఉదయం హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలోని శివాలయంలోకి నాగుపాము ప్రవేశిం చింది. ఉదయం ఎనిమిది గంటలకు ఆలయానికి 40 మంది భక్తులు రాగా, శివాలయం ద్వారం సమీపంలో ఉంది. వెంటనే గర్భగుడిలోకి వెళ్లింది. ఆ తర్వాత పూజారి దివాకర్ ఆచార్యులు శివాలయానికి రావడంతో పాము గర్భగుడిలో ఉందని భక్తులు చెప్పారు. పూజారి గర్భగుడిలోకి వెళ్లిచూడగా పాము పడగ విప్పి కూర్చొని ఉంది. అనంతరం నాగుపాముపై పూజారి పసుపు, కుంకుమ చల్లి హారతి ఇచ్చాడు. భక్తులు కూడా నాగుపాముకు మొక్కారు. ఆ తర్వాత భక్తులకు ఇబ్బంది కలుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు స్నేక్ స్నాచర్‌ని పిలిచారు. స్నేక్ స్నాచర్ నాగుపాముని పట్టుకుని సమీపంలోని పొదలో వదిలిపెట్టారు.



కోదాడలోని శివాలయంలో నాగుపాముకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు దివాకర్

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం కలిశారు. మూసీనది పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మాట మేరకు నిధులు విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, బత్తుల లక్ష్మారెడ్డి, డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి సీఎంతో పాటు మంత్రులను సత్కరించారు.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి, భువనగిరి కలెక్టరేట్)



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు

పండుగలకు ఊరెళ్తున్నారా.. జర భద్రం

● ప్రజలకు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ సూచనలు



నల్లగొండ క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి, క్రిస్మస్ పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణాల నుంచి పల్లెలకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఇంటికి, గేటుకు తాళం వేసి వెళ్లాల్సి వస్తే వివిధ జాగ్రత్తలు పాటించాలని, లేనిపక్షంలో ఇళ్లలో చోరీ జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఊరికి వెళ్లే ప్రజలకు ఆయన పలు సూచనలు ఇచ్చారు. ఈ సూచ నలు పాటిస్తూ జిల్లా పోలీస్ యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

- ఇంటికి, గేటుకు తాళం వేసి దూర ప్రాంతాలకు వెళ్లొద్దు, అత్యవసర పరిస్థితు ల్లో వెళ్లాల్సి వస్తే మీ సమీప, బంధువులు, మీకు తెలిసిన మిత్రులను ఇంటి దగ్గర నిద్రించే విధంగా చూసుకోవాలి.
- ఒకవేళ తాళం వేయాల్సిన పరిస్థితి ఏర్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు కనపడే విధంగా గేటుకు, మెయిన్ డోర్‌కి వేయకూడదు.
- గేటు బయట నుంచి కాకుండా లోపల నుంచి, మెయిన్ డోర్‌కు కాకుండా పక్క డోర్లకు తాళం వేసి తాళం కనపడకుండా కర్టన్‌తో కవర్ చేసే విధంగా ఉండాలి
- ఎట్టి పరిస్థితుల్లోనూ విలువైన వస్తువులు బంగారం, వెండి ఆభరణాలను, నగదును బీరువాలో పెట్టకూడదు.
- తప్పకుండా బ్యాంకు లాకర్‌లో భద్రపరుచుకోవాలి
- రాత్రి ఇంట్లో వెలుతురు ఉండే విధంగా ఏదో ఒక రూంలో లైట్ వేసి ఉంచాలి.
- తప్పనిసరిగా ఊరికి వెళ్లాల్సి వస్తే ఇంటి పక్కన ఉన్న వారికి, సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు విధిగా సమాచారం అందించాలి.
- పోలీస్‌స్టేషన్‌కి సమాచారంఇస్తే రాత్రి గస్తీ తిరిగే సిబ్బంది నిఘా ఉంచుతారు.
- ఫోన్‌లో నోటిఫికేషన్ వచ్చే సీసీ టీవీ కెమెరాలను ఇంటికి అమర్చుకోవాలి.
- ఇంటికి నాలుగు దిక్కులు వచ్చేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- కొత్తవారు, అనుమానితులు మీఇంటి చుట్టుపక్కల, కాలనీలో తిరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే డయల్ 100కు, పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వాలి.

22న ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): డైమండ్ అకాడమీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఈ నెల 22న నిర్వహించనున్న అండర్-19 చెస్ పోటీలను విజయవంతం చేయాలని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు కో రారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ కరపత్రాలను మిర్యా లగూడ పట్టణంలో గురువారం విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న చదరంగం పోటీలను పట్టణంలో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అంతర్జాతీయ క్రీడాకారిణి మాశెట్టి దివ్య మాట్లాడుతూ మిర్యాల గూడ పట్టణంలోని ఐఎంఏ భవనంలో నిర్వహించే పోటీలకు ఉమ్మడి జిల్లా నలు మూలల నుంచి 220మంది క్రీడాకారులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైమండ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి తర్వాత 'రైతు భరోసా'

నల్లగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తరు వాత జిల్లాలోని రైతులందరికీ రైతు భరోసా నిధులు విడుదల కానున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(జేడీఏ) పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా యాసంగి సీజన్‌తో పాటు పలు అంశాలపై రైతులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు.

గుండెబోయిన మల్లేశ్ యాదవ్(చిన్న నారాయణపురం) : మా గ్రామంలో 70 ఎకరాల ప్రభుత్వ భూమికి రైతుబంధు నిలిపి వేయాలి. ఆ భూమిని యాదవ సంఘం సొసైటీకి ఇప్పించడం అలాగే రైతుభరోసా రాక ఇబ్బందులు పడుతున్నాం.
జేడీఏ: 70ఎకరాల ప్రభుత్వ భూమికి రైతుబంధు వేయడం , పాటు బ్యాంకు రుణాలపై జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ డే రోజు ఫిర్యాదు చేయండి. సంక్రాంతి తరువాత రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉంది.
జెన్నారెడ్డి, (అప్పాజీపేట) : వరి చేలకు ఏ ఏ దశలలో ఏ ఏ దశల్లో ఎరువులు వేయాలి
జేడీఏ: డీఏపీ, పొటాష్ వేసి నాట్లు వేసినందున పిలక దశలో 45 రోజులకు ఎరువులు వేయాలి. యూరియా చల్లాలి.
(అప్పాజీపేట రైతులు) : మిర్చికి ఇగురు రావడం లేదు.లేత కొమ్మ ఆకులు రావడం లేదు.
జేడీఏ: వాతావరణం చల్లగా ఉన్నందున పంటలకు పలు సమస్యలు వస్తాయి. లేత కొమ్మలు, ఇగురు రావడం కోసం సస్యరక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు రసం పీల్చే పురుగుల నివారణ కోసం న్యూట్రిన్స్‌ను పిచికారీ చేయాలి.
ఋషిపాక వెంకటరెడ్డి (డిండి): ఆరుతడి పంటలకు నీటి విడుదల చేశారు. వరి సాగు చేయవచ్చా..
జేడీఏ: ఆరుతడి పంటలు వేసుకునేందుకు ఎంతగానో అవకాశం ఉంది. సన్నాల సాగు చేస్తే ప్రభుత్వం రూ.500బోనస్ ఇస్తుంది. రైతులు సన్నాల వైపు దృష్టిసారించాలి. ప్రస్తుతం 110 రోజులకే వరి దిగుబడి వచ్చే రకాలను కూడా వేసుకోవాలి. వెద జల్లే పద్ధతిలో కూడా సన్నాలను సాగు చేయవచ్చు. తెగులు వస్తే యాజమాన్య పద్ధతిలో వాటిని నివారించవచ్చు.
సత్యనారాయణ(అప్పాజీపేట): కొన్నేళ్లుగా పత్తి సాగు చేస్తున్నా. ఇప్పుడు పొలం సేద్యం చేసుకోవచ్చా..?
జేడీఏ: ఇప్పటికే మీరు అనేకసార్లు పత్తిసాగు చేశారు. పంట మార్పిడి చేయడం వల్ల కూడా పెద్ద ఎత్తున దిగుబడులు వస్తాయి. పొలం దమ్ము చేసే సమయంలో ఎకరానికి 20కిలోల జింక్ వేసి అనంతరం నాటు వేయండి
శ్రీనివాస్ (శాలిగౌరారం) శ్రీశైలం(చండపేట): నారు కొసలు ఎరుపురంగు వస్తుంది
జేడీఏ : నారులో కొసలు ఎరుపురంగు వచ్చినట్లయితే రాత్రిపూట పొలంలో కోసల వరకు నీరు నింపి మరుసటి రోజు ఉదయమే ఆ నీటిని తొలగించి కొత్తనీరును పొలంలో నింపాలి. అలాగే ఐరన్ సల్ఫేట్‌ను వేయాలి. 25 రోజులకు నాట్లు కూడా వేయవచ్చు. అదే సమయంలో అడుగు మందు వేయండి.
వెంకటయ్య (తాటికోల్) : ప్రస్తుతం ఆరుతడి పంటలతో పాటు కూరగాయల సాగు చేసుకోవడానికి అవకాశం ఉందా
జేడీఏ : ప్రస్తుతం ఆరుతడి పంటలతో పాటు కూరగాయలు సాగు చేసుకోవడానికి ఎంతగానో అవకాశం ఉంది. కూరగాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. డ్రిప్పుకు కూడా రాయితీ ఉంది. పచ్చిమిర్చి కూడా వేసుకోవచ్చు.
మహమ్మూద్ (కాశీవారిగూడెం): వరి పచ్చబడటం లేదు.
జేడీఏ: ప్రస్తుతం కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయి చల్లటి వాతావరణంతో పొలం పచ్చబడదు. దీని కోసం యాజమాన్య పద్ధతులు పాటించాలి. నాటు వేసి 15 రోజులు అయినందున చిలామిన్ జింక్ స్ప్రే చేయండి.
కొప్పుల అశోక్ రెడ్డి(కొత్తపేట) మిషన్‌తో నాట్లు వేయడం వల్ల వరి ఎర్రగా మారుతుంది.
జేడీఏ : 23 రోజుల కింద నాటు వేసినందున జింక్ వేయాలి. పొలంలో ఉన్న నీటిని ప్రతిరోజు ఉదయం బయటకు వదిలి వేయాలి. చలి ప్రభావంతో ఎర్రగా మారింది.

చంద్రారెడ్డి (పానగల్) దయాకర్‌రెడ్డి(వలివెల) : రుణమాఫీని ఎప్పటిలోగా పూర్తి చేశారు.
జేడీఏ: ప్రభుత్వం ఇప్పటికే రూ. 2లక్షల రుణమాఫీని పూర్తి చేసింది. త్వరలోనే రూ.2లక్షల పైగా రుణం తీసుకున్న రైతు లపైకూడా నిర్ణయం తీసుకొని మార్గదర్శకాలను విడుదల చేయ నుంది. అర్హులైన ప్రతి రైతుకు కటాఫ్ డేట్ ప్రకారం రుణమాఫీ వర్తిస్తున్నది.


'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీఏ శ్రవణ్ కుమార్

అనగంటి కృష్ణ (మునుగోడు) : ఏ సీజన్‌లో ఏ పంటలు వేయాలో రైతులకు అవగాహన కల్పించాలి
జేడీఏ : ప్రతి సీజన్‌లో ఏ పంటలు వేయాలనే దానిపై రైతు వేదికల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి మంగళవారం రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో రైతు వేదిక లకు వెళ్లే రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

బంగారు రవి(కోతులారం) : పత్తి దిగుబడి పెరగడానికి ఎలాంటి యాజమాన్య పద్ధతులు చేపట్టాలి.
జేడీఏ : ఒకేరకం విత్తనాలు కాకుండా ప్రభుత్వం అనుమతించిన విత్తనాలను వేస్తే దిగుబడి అధికంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో నాన్‌బీట్ లేదు. బూత్‌పూర్ వంటి ప్రాంతాల్లో కొందరు నకిలీ విత్తనాలను అంటగడుతారు. మంచి బీటీ విత్తనాలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయి.
రావిల శ్రీనివాస్ రెడ్డి (నందివహాడ్) : విత్తన తయారీ కేంద్రంలో ఆయిల్‌పామ్ నర్సరీని ఏర్పాటు చేయాలి.
జేడీఏ: ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తుంది. 163 ఎకరాలు అక్కడ ఉన్నందున ఆయిల్ పామ్ నర్సరీని ఏర్పాటు చేయాలని కోరుతున్నందున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

వంగూరి వెంకటయ్య (మేళ్లదుప్పలపల్లి) : వరి దిగుబడి పెరగ డానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి. నిమ్మకు వేరు తెగుళ్ల నివారణకు ఏమి చేయాలి
జేడీఏ : పంటల దిగుబడి పెరగడానికి సూపర్‌తో పాటు డీఏపీ వేయాలి. పొట్ట దశలో యూరియా పోటాషియం వేయండి. 45 రోజుల తరువాత పిలకలు వేసే దశలో యూరియా వేయాలి. నిమ్మకు వేరు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సైడ్ చెట్టు పాదల్లో వేయడంతో పాటు ట్రైకోడెర్మావిరిడిని పశువుల ఎరువులతో కలిపి వేయాలి.

రద్దు చేసిన చట్టాలను తిరిగి తేవొద్దు

చిట్యాల, డిసెంబరు 19, (ఆంధ్రజ్యోతి): రద్దు చేసిన రైతు చట్టాలను తిరిగి తీసుకువచ్చే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ డిమాండ్ చేశారు. చిట్యాలలో సంఘం ఆధ్వర్యంలో నల్లజెండాలతో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘాల ఉద్యమాలతో రద్దు చేసిన నల్ల చట్టాలను కేంద్రప్రభుత్వం తిరిగి తీసుకురావడానికి ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను మానుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదలను, రైతులను దోచి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, లడె రాములు, బొబ్బల సుధాకర్‌రెడ్డి, ఐతరాజు యాదయ్య, కోనేటి రాములు, స్వామి పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలి

నల్లగొండ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశాల్లో ఆశావర్లకు ఫిక్స్‌డ్ వేతనాలు నిర్ణయించి, వాటిని అమలు చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయు) జిల్లా గౌరవ అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆశవర్కర్ల బస్సు జాతా పోస్టర్‌ను గురువారం పట్టణంలో ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు 20 సంవత్స రాలుగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఆరోగ్య వారధిలా పనిచేస్తున్నారన్నారు. వీరికి ప్రభు త్వం వేతనాలు ఇవ్వకుండా పారితోషికాల పేరిట శ్రమ దోపిడీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో దండంపల్లి సత్తయ్య, పోలె సత్యనారాయణ, ప్రేమలత, సీహెచ్ వీరభద్రమ్మ, సౌజన్య ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికులా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన నల్లగొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ కమిటీని గురువారం జిల్లాకేంద్రంలో సన్మానించారు. యువజన కాంగ్రెస్‌లో పనిచేసిన వారు కాంగ్రెస్ పార్టీలో ఉన్నత స్థానాలకు ఎదిగారని మంత్రి కోమటిరెడ్డి కూడా యువజన కాంగ్రెస్‌లో పనిచేశారని గుర్తుచేశారు. సమావేశంలో వంగూరి లక్ష్మయ్య, జూకూరి రమేష్, కత్తుల కోటి, గడ్డం అనూప్ రెడ్డి, జూలకంటి సైదిరెడ్డి, మామిడి కార్తీక్, నాగరాజు, జహంగీర్, సతీష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సీఎం సహాయనిధి అందాలి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న చాడ కిషన్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మనస్సు చేసుకొని సీఎం సహాయ నిధి కోసం ఆర్జీ పెట్టుకున్న ప్రతి లబ్ధిదారుడికీ నిధులు విడుదల చేసి ఆసరాగా నిలవాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్ రెడ్డి కోరారు. సీఎం సహాయ నిధి కింద విడుదలైన రూ.8.67లక్షల విలువైన చెక్కులను జిల్లాకేంద్రంలో గురువారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట శ్రీనివాస్, నాయకులు ఎస్‌కె.లతీఫ్, ముక్కాముల వెంకన్న, నారి నర్సింహ, సైదిరెడ్డి, కర్నాటి మల్లేష్, కంచర్ల శ్రవణ్‌గౌడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కేతేపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. మండలంలోని 16గ్రామపంచాయతీల నుంచి ప్రజా పాలనలో నివాస గృహాల కోసం 10,540మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్తున్న అధికారులు ప్రస్తుత ఇంటి స్థితిగతులు పరిశీలించి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఇంటి స్థలం డాక్యుమెంటు, విద్యుత్ బిల్లు, ఇంటి పన్ను రశీదుల్లో ఏదైనా ఒకటి తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వారం రోజులుగా సాగుతున్న సర్వే సందర్భంగా అధికారులు మండలంలోని 1560మంది దరఖాస్తుదారులను పరిశీలించారు. ఉప్పలపహాడ్, కొప్పోలు, తుంగతుర్తి, కొండకిందిగూడెం, బండపాలెం, చెరుకుపల్లి గ్రామాల్లో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు పరిశీలించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కట్టంగూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. కట్టంగూరులోని కేజీబీవీ పాఠశాల ఎదుట విద్యార్థులతో కలిసి గురువారం నిరసన చేపట్టారు. కేజీబీవీ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు కొన్ని రోజులుగా సమ్మెలో పాల్గొన్నారని దాని వల్ల విద్యార్థులకు విద్యాబోధన చేసేవారు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మునుకు రవీందర్, వేణు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం : వెదిర


చెక్కు అందజేస్తున్న విజయేందర్‌రెడ్డి

మునుగోడు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని కొంపల్లి రామాలయ చైర్మన్ వెదిర విజయేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన వీరమల్ల సర్వయ్యకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జల వెంకన్న యాదవ్, దాం యాదయ్య, జీడిమెట్ల వెంకటయ్య, బోయపర్తి లింగయ్య, మొగుదాల పెంటయ్య, బాజా మనోజ్ తదితర పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి అభినందనీయం

చింతపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంక్షేమానికి ఆఫ్ వే హోం నిర్వాహకులు కృషి చేయడం అభినందనీయమని జిల్లా మహిళ, వృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి అన్నారు. మండ లం లోని గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్‌లో సీబీఆర్ (ఆఫ్‌వే హోం) ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆప్ వే హోం నిర్వాహకులు అనిల్‌కుమార్, వైస్ ప్రిసెడింట్ మీనాక్షి, పీడీ సంతోష్‌కుమార్, కిరణ్, శ్రీనివాస్, యాదగిరి, ధనలక్ష్మి, చంద్రశేఖర్, నాయకులు పూరె లక్ష్మణ్, కొండూరు శ్రీనివాస్, మాస భాస్కర్ ఉన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో తైక్వాండో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రీడా పోటీలు, మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మూడు జిల్లాల నుంచి తైక్వాండో క్రీడాకారులు హాజరై క్రీడా ప్రతిభను కనబర్చారు. వివిధ కేటగిరిల్లో బాల, బాలికలు తలపడ్డారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలు ఎంపిక చేశారు. మేకల అభినవ్ స్టేడియంలో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ జిల్లాస్థాయి పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల, వివిధ క్రీడా సంఘాల కార్యదర్శులు యూనుస్ కమాల్, నారాయణ, యాక స్వామి, ప్రణీత్, నజీర్, రమేష్ పాల్గొన్నారు.

శాలిగౌరారం, (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో నిర్వహించిన సీఎం కప్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో శాలిగౌరారం బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధించింది. క్రీడాకారులను శాలిగౌరారం జడ్పీస్కూల్ పీఈటీ, మండల క్రీడల ఇన్‌చార్జి జ్యోతిని మండల ప్రత్యేక అధికారి మన్యా నాయక్, ఎంఈవో మందుల సైదులు, ఎంపీవో పద్మ అభినందించారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టు


మునుగోడులో పోలీసులు అదుపులోకి తీసుకున్న మాలమహానాడు నాయకులు

నార్కట్‌పల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మాల మహానాడు నాయకులను నార్కట్‌పల్లి పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేశ్, బాజ భాను, హేమంత్, మాదాసు నరేశ్, దాసరి నరేందర్, ఈసం జయరాజ్, అల్లె పవన్, యనమల్ల కిరణ్‌లు ఉన్నారు.

మునుగోడు, (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలానికి చెందిన పలువురు మాల మహానాడు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు రాష్ట్ర కమిటీ పిలుపు నేపథ్యంలో తమను ముందస్తుగా అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌లో నిర్బంధించారని నాయకులు ఆరోపించారు. అరెస్టు అయిన వారిలో వల మహానాడు సంఘం నేతలు జంగిలి నాగరాజు, ముచ్చపోతుల నర్సింహ, ముచ్చపోతుల శ్రీనివాస్, పెరుమాళ్ల ప్రమోద్‌కుమార్, బొల్లు సైదులు, రాజారామ్, శ్రీను, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ, (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు నాయకులను అర్ధరాత్రి ముందస్తు అరెస్టు చేయడం సరికాదని మాల మహానాడు మండల అధ్య నాగిళ్ల మారయ్య, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం తెలంగాణ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తుగా మహేశ్వరం రమేష్, పెద్దిరాజు, చెల్లం శంకర్, ఈద కాశి, యంజాల యాదగిరి, యంజాల అనిల్, చెల్లం రమేష్, చెల్లం సుందర్, ఈద అభిసందేశ్ మాల మహానాడు నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సమయ పాలన ప్రాధాన్యం తెలుసుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు

నల్లగొండ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమయ పాలన ప్రాధాన్యం తెలుసుకోవాలని నల్లగొండ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బి. శ్రీనివాస్ అన్నారు. నల్లగొండ కేంద్రీయ విద్యాలయంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మహిళా విభాగం శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు గురువారం శిక్షణ నిర్వహించారు. బీపీ, వ్యాయామం, కిట్ ఇన్‌స్పక్షన్, క్రమ శిక్షణ, పరిశుభ్రత, సమయపాలన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గైడ్ కెప్టెన్, ఫ్లాక్ లీడర్ల బాధ్యతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీఎస్అండ్‌జీ టి. ధనలక్ష్మి, దక్షిణ మధ్య రైల్వే బీఎస్ అండ్‌డీ వహిదా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు


తిప్పర్తిలో నినాదాలు చేస్తున్న జీపీ కార్మికులు

తిప్పర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు కంచర్ల జానయ్య, కార్యదర్శి పాలడుగు చంద్రయ్య అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌కు బయలుదేరుతున్న కార్మికులను అరెస్టు చేయడాన్ని నిరసనగా గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో షైనం మల్లయ్య, వెంకన్న, చంద్రయ్య, యాదయ్య, అంజయ్య, పరమేష్, మరియమ్మ, భాస్కర్, సౌందర్య ఉన్నారు.

మునుగోడు, (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన గొర్రెలు, మేకల పెంపకందారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చకుండా అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా అధ్యక్షుడు సాగర్ల మల్లేష్ అన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరుతూ గురువారం నిర్వహించ తలపెట్టిన ఇందిరా పార్కు వద్ద ధర్నా నేపథ్యంలో నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు.

కట్టంగూరు, (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ఇందిరా పార్కు ధర్నాను ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదని గ్రామపంచాయతీ కార్మికులు గురువారం కట్టంగూరులో ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పొన్నం అంజయ్య, వెంకన్న, వెంకటయ్య, రామలింగయ్య, మల్లికార్జున్, గద్దపాటి రవి, వేముల అంజయ్య, వీరయ్య పాల్గొన్నారు.

కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర

మునుగోడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిజమైన పోరాటాలు, త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. మునుగోడులోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. భూమి. భుక్తి కోసం పీడిత ప్రజల బానిసత్వం విముక్తి కోసం పేద ప్రజల హక్కుల సాధన కోసం ప్రతినిత్యం ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన నిరంతర పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. అంతటి నిబద్ధత కలిగిన కమ్యూనిస్టులపై కొందరు విమర్శలు చేయటం శోచనీయమన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురిజ రామచంద్రం, బొలుగూరి నర్సింహ, చాపల శ్రీను, గోసుకొండ లింగయ్య, సురిగి చలపతి, లాలు, యాదయ్య, పాండు, కైలాసం ఉన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



చిట్యాల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నల్లగొండలో ఈ నెల 28 నుంచి 30వరకు జరిగే యూటీఎఫ్ 6వ విద్యా, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు ఏశమల్ల నాగయ్య కోరారు. చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాసభల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొప్పని యాదయ్య, గడగోజు సతీష్, రంగా రామలింగయ్య, జానకి, తోట చంద్రశేఖర్, గోగికార్ మాధవి, నకిరేకంటి శ్రీధర్, సాధిక్ పాల్గొన్నారు.

సుశీలగోపాలన్ వర్ధంతి

చిట్యాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఐద్వా మాజీ జాతీయ నాయకురాలు సుశీల గోపాలన్ వర్ధంతిని గురువారం ఐద్వా మండల శాఖ ఆధ్వర్యంలో చిట్యాలలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం సుశీలగోపాలన్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, పి. గీత, లక్ష్మి, యాదమ్మ, మంగ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక

చిట్యాల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని 100వ బూత్ బీజేపీ అధ్యక్షుడిగా పురం ప్రశాంత్, 101 బూత్ అధ్యక్షుడిగా ఐతరాజు సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన బూత్ కమిటీల సమావేశంలో వారిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చికిలంమెట్ల అశోక్, కూనూరు సంజయ్‌దాస్, మాస శ్రీనివాస్, కన్నె బోయిన మహలింగం, గుండాల నరేష్‌గౌడ్, జయారపు రామకృష్ణ, బండగోని వెంకట్‌రాములు, గాదె శ్రీహరి పాల్గొన్నారు,

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

కేతేపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల ఆరాధ్య దైవం ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు సమీపిస్తుండడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. చెరుకుపల్లి, భీమారం, ఇనుపాముల, రాయపురం, కేతేపల్లి, కొత్తపేట, కొర్లపహాడ్, కొప్పోలు, తుంగతుర్తి గ్రామాల్లో గల చర్చిలను క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు. ఈ ఏడాది వారం రోజుల ముందుగానే గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. గ్రామాల్లో బాల, బాలికలు క్రిస్మస్ తాత వేశధారణతో రాత్రివేళల్లో ఊరంతా కలియ తిరుగుతూ అందరినీ అలరిస్తున్నారు. మూడు రోజులుగా ఆయా గ్రామాలలో తలపై కుచ్చుటోపి, తెల్లటి గడ్డం, ఎరుపు రంగు వస్త్రాలు, ఓ చేతిలో బెలూన్‌లు, మరో చేతిలో చేతికర్రతో క్రిస్మస్ తాతలు సందడి చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకల నిర్వహణకు అవసరమైన పశువుల పాకలను ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కేతేపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైనట్లకు అడ్డుగా ఉన్న కొమ్మలు తొలిస్తున్నందున మండలంలోని చెరుకుపల్లి, కేతేపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో 10 గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ టి.శ్రీకాంత్ తెలిపారు. చెరుకుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని తుంగతుర్తి, బండపాలెం, చెరుకుపల్లి గ్రామాలు, కేతేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గుడివాడ, కొత్తపేట, కేతేపల్లి, కొర్లపహాడ్, ఇనుపాముల, చీకటిగూడెం, కాసనగోడు గ్రామాలకు శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో నెలకొనే ఈ అంతరాయానికి ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో పారాయణం


చిట్యాలరూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడలో సీతారామాంజనేయస్వామి దేవాలయంలో 44వ మార్గళి ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవాలయంలో తిరుప్పావై 4వ పాశురం పారాయణం చేశారు. 44వ మార్గళి ధనుర్మాసోత్సవాల పూజల సందర్భంగా భక్తులు దేవాలయంలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజాకార్యక్రమంలో పా ల్గొన్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బెల్ట్‌షాపుపై దాడి

మర్రిగూడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో లెంకలపల్లి గ్రామానికి చెందిన చేపల స్వామికి సంబంధించిన బెల్ట్‌షాప్‌పై పోలీసులు దాడులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 7.8లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5 శుక్రవారం 20 డిసెంబరు 2024



లెక్క తేలేదెట్టా?

- భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12వేలు
- ప్రకటించిన ప్రభుత్వం
- 28న తొలి విడతగా రూ.6వేలు
- ఇప్పటి వరకు అధికారుల వద్ద రైతుల సమాచారం కరువు
- మార్గదర్శకాలు వెల్లడించని ప్రభుత్వం

చర్చ CHARCHA

నల్లగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12వేలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. ఎన్నికల ముందు ఇచ్చిన పలు హామీల్లో భాగంగా భూమి లేని నిరుపేదలను ఆదుకునేందుకు ఈ పథకాన్ని తీసుకువచ్చింది. అయితే ఈ పథకం విధి విధానాలను మాత్రం ప్రభుత్వం ప్రకటించలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భూమి లేని నిరుపేదలు ఎంతమంది ఉన్నారనే లెక్కలపై స్పష్టత లేదు. ఇటీవల ప్రభుత్వం కుటుంబ సమగ్ర సర్వేను నిర్వహించగా, ప్రజలు ఆస్తుల వివరాలు వెల్లడించేందుకు ముందుకురాలేదు. చాలా మంది భూములు లేవని వివరాలు నమోదు చేయించినట్టు సమాచారం. అయితే ఎవరికి భూమిలేదనే విషయం తెలుసుకునేందుకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖ లేదంటే పాన్‌కార్డు, ఆధార్‌కార్డు ఆధారంగా లెక్కలు తీయాలి. ప్రభుత్వం భూమి లేని నిరుపేదలను గుర్తించే విషయంలో కసరత్తు చేయకుండానే ఏకంగా నిధులు కేటాయిస్తామని ప్రకటించడంపై ఈ పథకం అమలుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 10లక్షల మందికి పైగా రైతులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10.50లక్షల మందికి పైగా రైతులు ఉన్నారు. అందులో నల్లగొండ జిల్లాలో 5,40,000మంది, యాదాద్రి జిల్లాలో 2లక్షల మందికి పైగా, సూర్యాపేట జిల్లాలో మూడు లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. మూడు జిల్లాల్లో కలిపి సుమారు 3.5 లక్షల మంది పైగా కౌలు రైతులు ఉన్నట్టు సమాచారం. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 33లక్షల మందికి పైగా జనాభా ఉంది. నల్లగొండ జిల్లాలో 16,18,416మంది జనాభా ఉండగా, యాదాద్రి జిల్లాలో 7,10,833మంది, సూర్యాపేట జిల్లాలో 10,99,566 జనాభా ఉంది. వీరిలో భూమిలేని రైతులు ఎంతమంది ఉన్నారనేది అధికారులు తేల్చాల్సి ఉంది. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉండి భూమి లేని వారిని గుర్తించాల్సి ఉంది. ఈ తతంగం పూర్తయ్యేది ఎప్పుడో? భూమిలేని వారికి డబ్బు జమయ్యేది ఎప్పుడో? వేచి చూడాల్సిందే.

భూమి లేని పేదల సంఖ్య ఎలా?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3.5లక్షల మందికి పైగా కౌలు రైతులు ఉన్నట్టు సమాచారం. ఈ కౌలు రైతుల్లో ఎంత మంది భూమి లేని వారు ఉన్నారనేది తేల్చడంతో పాటు అసలు భూమి లేని నిరుపేదలు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడి జీవించే వారి సంఖ్య తేల్చాల్సి ఉంది. కౌలు రైతులు భూమి లేని వారు ఉన్నా, వారికి కౌలుకు భూమి ఇచ్చిన పట్టా రైతులు కౌలు కాగితం రాసి ఇచ్చేందుకు ముందుకురారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కౌలు రైతులను, భూమిలేని నిరుపేదలను దృష్టిలో ఉంచుకుని ఏటా రూ.12వేలు చెల్లించాలంటే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

అయితే ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి కసరత్తు చేసిన దాఖలాలు లేవు. భూమి లేని వివరాలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంతో పాటు సీపీవో (ముఖ్య ప్రణాళిక) దగ్గరగానీ, జిల్లా వ్యవసాయ అధికారుల వద్దగానీ పూర్తిస్థాయి సమాచారం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పథకం అమలు చేయడం ఎలా సాధ్యమనే అయోమయ పరిస్థితి అధికార యంత్రాంగంలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం భూమి లేని నిరుపేదలకు ఈ నెలాఖరులోగా బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని ప్రకటించడం గమనార్హం. భూమి లేని వారి సంఖ్యను తేల్చడానికి ప్రభుత్వం ఇప్పటి వరకు ఉమ్మడి అధికారులతో కమిటీలు

మిగతా 6వ పేజీలో...



తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన రొట్టెల చిన్న సైదులుకు కనీసం గుంట భూమి కూడా లేదు. తన కుటుంబంలో పెద్దలకు కూడా భూమి లేకపోవడంతో వారసత్వంగా కూడా అతడికి భూమి రాలేదు. తిప్పర్తిలోనే మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలు చేస్తున్నా, పెద్దగా పంటలు పండకపోవడంతో ఏటా అప్పులే మిగులుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12వేలు చెల్లించాలని నిర్ణయం తీసుకోవడం, మొదటి విడత ఈ నెల 28న రూ.6,000 వారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని ప్రకటించడంతో అతడు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. అయితే ఈ పథకం ఏ మేరకు అమలు అవుతుందనేది అర్థంకాని పరిస్థితి. దీంతో ఖాతాలో ఆ సొమ్ము జమ అయినప్పుడు మాత్రమే వచ్చినట్టు అని అతడు పేర్కొంటున్నాడు.



'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్‌లో కార్యక్రమంలో పాల్గొన్న జేడీఏ శ్రవణ్‌కుమార్, వ్యవసాయాధికారులు

సంక్రాంతి తరువాత 'రైతు భరోసా'

- ప్రతీ రైతుకు సంక్షేమ పథకాలు
- జేడీఏ పి.శ్రవణ్ కుమార్
- కొండమల్లేపల్లి ఏవోపై రైతుల ఫిర్యాదు
- ఏవో జానకిరాములుకు షోకాజ్ జారీ
- విచారణకు అధికారిని నియమించిన జేడీఏ
- 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన

నల్లగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ తరువాత జిల్లాలోని రైతులందరికీ రైతు భరోసా నిధులు విడుదల కానున్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' గురువారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో జేడీఏతోపాటు పలువురు వ్యవసాయాధికారులు పాల్గొని రైతుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ, ప్రతీ రైతుకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ఇప్పటికే అందుతున్నాయని, త్వరలో కొత్త పథకాలు కూడా చేరుతాయన్నారు. అదేవిధంగా కొండమల్లేపల్లి ఏవో జానకిరాములుపై రైతులు ఫిర్యాదు చేయడంతో అప్పటికప్పుడే సదరు అధికారికి షోకాజ్ జారీ చేయడంతోపాటు విచారణకు ఓ అధికారిని నియమించారు. ఈ కార్యక్రమంలో కంపాసాగర్ సీనియర్ శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారులు ఎ.శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, కట్ట కీర్తి, స్టేఫీ, కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. యాసంగి సీజన్‌తో పాటు పలు అంశాలపై రైతులు అడిగిన ప్రశ్నలకు జేడీఏ, శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు.

వినోద్‌నాయక్ (కొండమల్లేపల్లి), కుర్ర కోటేష్‌నాయక్ (చింతపల్లి): కొండమల్లేపల్లి ఏవో అందుబాటులో ఉండటం లేదు. అంతేగాక గ్రామానికి రైతు వేదిక చాలా దూరంగా ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏవోకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా రైతులకు అందుబాటులో ఉండటం లేదు. రైతుల సమస్యలపై స్పందించడం లేదు.

జేడీఏ: రైతులకు అందుబాటులో ఉండని కొండమల్లేపల్లి ఏవో జానకిరాములుకు షోకాజ్ నోటీస్ జారీ చేయడంతో పాటు విచారణ కోసం సూపరింటెండెంట్ స్థాయి అధికారిని నియమిస్తాం. రైతుల సమస్యలను ఎవరు నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించేది లేదు.

మరిన్ని వివరాలు 8లో..

సైబర్ నేరాల దర్యాప్తులో

బ్యాంకర్లు సహకరించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమని, ఈ నేరాల దర్యాప్తులో బ్యాంకర్లు పోలీసులకు సహకరించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కోరారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరిగి క్యాష్‌లెష్ లావాదేవీలు జరుగుతున్న ప్రస్తుత రోజుల్లో యూపీఐ, బ్యాంకు అకౌంట్‌లను ఆధారంగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు తప్పుడు మార్గాలను ఎంచుకుని అమాయకులను మోసగిస్తున్నారన్నారు. సైబర్ నేరాల విచారణలో బాధితుల బ్యాంకు అకౌంట్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇవ్వాలన్నారు. కోర్టు అనుమతితో సైబర్ బాధితులకు చేరాల్సిన డబ్బును అకౌంట్‌లో క్రెడిట్ చేసి, ఆ అకౌంట్‌ను అన్‌ఫ్రీజింగ్ చేసి బాధితులకు అండగా నిలవాలన్నారు. బాధితులు కోల్పోయిన డబ్బు వచ్చినప్పుడే వారిలో పోలీసులపై నమ్మకం పెరుగుతుందన్నారు. ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రతీ బ్యాంకులో హైరెజల్యూషన్ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఏటీఎం సెంటర్లలో కూడా అమర్చాలని సూచించారు. సెక్యూరిటీ అలారాలు సైతం అమర్చాలన్నారు. ప్రతీ బ్యాంకు వద్ద భద్రతా సిబ్బంది 24 గంటలు ఉండేలా చూసుకోవాలన్నారు. వివిధ స్కీంల ద్వారా లోన్లు ఇప్పిస్తామని అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని, అలాంటి వారిని ముందుగానే గమనించి పోలీసులకు సమచారం ఇవ్వాలన్నారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానిత లింక్‌లను, యాప్ ఫైల్స్‌ను తెరవకూడదని సూచించారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 లేదా సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్‌బీ డీఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్బీ సీఐ రాఘవరావు, నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌పై ఉద్యోగులకు శిక్షణ

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ డిప్యూటీ కార్యదర్శి భవేశ్ మిశ్రా

నల్లగొండ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఐటీ టవర్ ద్వారా ఉద్యోగులకు ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ డిప్యూటీ కార్యదర్శి, ఐఏఎస్ అధికారి భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం కలెక్టర్ ఇలాత్రిపాఠితో కలిసి హైదరాబాద్ రోడ్డులోని ఐటీ టవర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటీ టవర్ చాలా బాగుందని, ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు ఉద్యోగులను గుర్తించడంతోపాటు, 20 బృందాలుగా విభజించి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించారు. ఐటీ టవర్‌లో 500మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో జపాన్‌కు చెందిన ఓ కంపెనీ తన కార్యకలాపాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. అలాగే ఐటీ టవర్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నివేదికలు త్వరితగతిన రూపొందించడమే గాక, కంప్యూటర్ పనులు సులభతరం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, ఐటీ టవర్ మేనేజర్ నాగరాజు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ ఐటీ టవర్‌ను పరిశీలించి కలెక్టర్ ఇలాత్రిపాఠి, అధికారులతో మాట్లాడుతున్న భవేశ్ మిశ్రా

మెరుగైన వైద్యసేవలు అందించాలి

(ఆంధ్రజ్యోతి, పెద్దఅడిశర్లపల్లి): గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది లేకపోవడంపై ఆరా తీశారు. అనంతరం అవుట్ పేషెంట్లు, వివిధ రకాల జబ్బులతో వస్తున్న రోగులు, ప్రసవాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళకు ఫోన్‌చేసి పేరు ఇక్కడి ఆస్పత్రిలో నమోదు చేయించుకొని వేరేచోట ఎందుకు ప్రసవం చేయించుకున్నారని కలెక్టర్ ఆరా తీశారు. స్టాఫ్‌నర్స్ లేరని తెలుసుకుని వెంటనే డిప్యూటేషన్‌పై పంపాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలోనే స్టాఫ్‌నర్స్ నివాసం ఉండేలా నివాస గృహాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అనంతరం అంగడిపేట పంచాయతీ పోతిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇంటి సర్వేను తనిఖీ చేశారు. మండలంలో సర్వే నెమ్మదిగా చేస్తున్నారని, తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఆమె వెంట గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇంటి సర్వే వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, పెద్దవూర): ఇందిరమ్మ ఇంటి సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. గురువారం మండలంలోని బట్టుగూడెం, పెద్దవూర మండల కేంద్రంలో సర్వేను ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సర్వేలో సమస్యలు ఎదురైతే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 18004251442 ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సర్వే సమయంలో దరఖాస్తుదారు అందుబాటులో లేకుంటే యాప్‌లో వివరాలు పాక్షికంగా అప్‌లోడ్ చేయాలని, దరఖాస్తుదారుకు సమాచారం ఇచ్చి వారు అందుబాటులో ఉన్నప్పుడు ఫొటో సహా పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో ఉమాదేవి, తదితరులు ఉన్నారు.

మాలమహానాడు నేతల ముందస్తు అరెస్టు

ఖండించిన నాయకులు




నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న మాలమహానాడు నాయకులు

నల్లగొండక్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ గురువారం తలపెట్టిన చలో అసెంబ్లీ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మాలమహానాడు నాయకులను పోలీసులు గురువారం అర్ధరాత్రి నుంచే అరెస్ట్ చేశారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకు నాయకుల ఇళ్లకు వెళ్లిన పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదలచేశారు. కాగా, అరెస్టులను పలువురు నాయకులు ఖండించారు. మాలమహానాడు జాతీయ స్టీరింగ్ కమిటీ మెంబర్ గోలి సైదులు, రాష్ట్ర కార్యదర్శి తెల్గమళ్ల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు భోగరి విజయ్‌కుమార్, నాయకులు కూన యాదయ్య, గండమళ్ల శ్రీనివాస్, చింతపల్లి సైదులుతో పాటు పలువురు నేతలను నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, అరెస్టయిన నాయకులకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంచి మధుసూదన్, గోలి సైదులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, ప్రాణాలను పణంగా పెట్టయినా వర్గీకరణను అడ్డుకుంటామన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు మాల నాయకులు పార్టీ జెండాలను భుజాలపై పెట్టుకుని గ్రామ, గ్రామాన ప్రచారం నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఎత్తుకున్న జెండాను దించడం కష్టమైన పనేమీ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని గుర్తించి వెంటనే వర్గీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు లింకేజీ పూర్తిచేయాలి

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

గుర్రంపోడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలకు నూరుశాతం బ్యాంకు లింకేజీలు పూర్తి చేయాలని డీఆర్డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో సెర్ప్ కార్యక్రమాలపై వీవోఏలతో సమీక్షించి స్త్రీనిధి రుణాల రికవరీ నూరుశాతం చేయాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద సంఘం సభ్యులకు పాడిగేదెలు ఇప్పించాలన్నారు. సంఘాల్లో ఉన్న సభ్యులందరికీ రుణాలు, ప్రమాద బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్

మల్టీజోన్-2కు అటాచ్

ఎస్పీ నివేదికతో ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ సత్యనారాయణ

నల్లగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే ఆరోపణలతో నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్ కుమార్‌ను మల్టీజోన్-2 ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపిస్తూ సదరు మహిళ భర్త ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు ఈనెల 14వ తేదీన ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్పీ విచారణ చేయించారు. అయితే ఆ విచారణలో మహిళ భర్త ఆరోపణలు వాస్తవమని తేలడంతో, ఆ నివేదికను ఎస్పీ ఉన్నతాధికారులకు నివేదించారు. ఎస్పీ నివేదిక ప్రకారం సీఐ డానియల్‌ను మల్టీజోన్-2 కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఐజీ సత్యనారాయణ గురువారం ఆదేశాలు జారీ చేశారు. కాగా, ప్రస్తుతానికి నల్లగొండ టూటౌన్ సీఐగా ఎవరికీ బాధ్యతలు అప్పగించలేదు. నేడో రేపో టూటౌన్ సీఐగా నూతన అధికారి రానున్నట్లు సమాచారం.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి



గూడూరులో సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గూడూరు గ్రామంలో సర్వేను ఆయన తనిఖీచేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా అర్హులైన పేదలను గుర్తించాలన్నారు. అనంతరం పట్టణంలోని బకల్‌వాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేశారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో గోనారెడ్డి, రాంరెడ్డితో కలిసి పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరి శర్మ, ఎంపీవో రమేష్, ఎంఈవో బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ముంబై సముద్ర తీరంలో పడవ ప్రమాదం

బీబీనగర్ యువకుడి మృతి

6

సంక్రాంతి తర్వాత 'రైతు భరోసా'

నల్లగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తరు వాత జిల్లాలోని రైతులందరికీ రైతు భరోసా నిధులు విడుదల కానున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(జేడీఏ) పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా యాసంగి సీజన్‌తో పాటు పలు అంశాలపై రైతులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు.

గుండెబోయిన మల్లేశ్ యాదవ్(చిన్న నారాయణపురం) : మా గ్రామంలో 70 ఎకరాల ప్రభుత్వ భూమికి రైతుబంధు నిలిపి వేయాలి. ఆ భూమిని యాదవ సంఘం సొసైటీకి ఇప్పించడం అలాగే రైతుభరోసా రాక ఇబ్బందులు పడుతున్నాం.
జేడీఏ: 70ఎకరాల ప్రభుత్వ భూమికి రైతుబంధు వేయడం , పాటు బ్యాంకు రుణాలపై జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ డే రోజు ఫిర్యాదు చేయండి. సంక్రాంతి తరువాత రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉంది.
జెన్నారెడ్డి, (అప్పాజీపేట) : వరి చేలకు ఏ ఏ దశలలో ఏ ఏ దశల్లో ఎరువులు వేయాలి
జేడీఏ: డీఏపీ, పొటాష్ వేసి నాట్లు వేసినందున పిలక దశలో 45 రోజులకు ఎరువులు వేయాలి. యూరియా చల్లాలి.
(అప్పాజీపేట రైతులు) : మిర్చికి ఇగురు రావడం లేదు.లేత కొమ్మ ఆకులు రావడం లేదు.
జేడీఏ: వాతావరణం చల్లగా ఉన్నందున పంటలకు పలు సమస్యలు వస్తాయి. లేత కొమ్మలు, ఇగురు రావడం కోసం సస్యరక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు రసం పీల్చే పురుగుల నివారణ కోసం న్యూట్రిన్స్‌ను పిచికారీ చేయాలి.
బుషిపాక వెంకటరెడ్డి (డిండి): ఆరుతడి పంటలకు నీటి విడుదల చేశారు. వరి సాగు చేయవచ్చా..
జేడీఏ: ఆరుతడి పంటలు వేసుకునేందుకు ఎంతగానో అవకాశం ఉంది. సన్నాల సాగు చేస్తే ప్రభుత్వం రూ.500బోనస్ ఇస్తుంది. రైతులు సన్నాల వైపు దృష్టిసారించాలి. ప్రస్తుతం 110 రోజులకే వరి దిగుబడి వచ్చే రకాలను కూడా వేసుకోవాలి. వెద జల్లే పద్ధతిలో కూడా సన్నాలను సాగు చేయవచ్చు. తెగులు వస్తే యాజమాన్య పద్ధతిలో వాటిని నివారించవచ్చు.
సత్యనారాయణ(అప్పాజీపేట): కొన్నేళ్లుగా పత్తి సాగు చేస్తున్నా. ఇప్పుడు పొలం సేద్యం చేసుకోవచ్చా..?
జేడీఏ: ఇప్పటికే మీరు అనేకసార్లు పత్తిసాగు చేశారు. పంట మార్పిడి చేయడం వల్ల కూడా పెద్ద ఎత్తున దిగుబడులు వస్తాయి. పొలం దమ్ము చేసే సమయంలో ఎకరానికి 20కిలోల జింక్ వేసి అనంతరం నాటు వేయండి
శ్రీనివాస్ (శాలిగౌరారం) శ్రీశైలం(చందపేట): నారు కొసలు ఎరుపురంగు వస్తుంది
జేడీఏ : నారులో కొసలు ఎరుపురంగు వచ్చినట్లయితే రాత్రిపూట పొలంలో కొసల వరకు నీరు నింపి మరుసటి రోజు ఉదయమే ఆ నీటిని తొలగించి కొత్తనీరును పొలంలో నింపాలి. అలాగే ఐరన్ సల్ఫేట్‌ను వేయాలి. 25 రోజులకు నాట్లు కూడా వేయవచ్చు. అదే సమయంలో అడుగు మందు వేయండి.
వెంకటయ్య (తాటికోల్) : ప్రస్తుతం ఆరుతడి పంటలతో పాటు కూరగాయల సాగు చేసుకోవడానికి అవకాశం ఉందా
జేడీఏ : ప్రస్తుతం ఆరుతడి పంటలతో పాటు కూరగాయలు సాగు చేసుకోవడానికి ఎంతగానో అవకాశం ఉంది. కూరగాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. డ్రిప్పుకు కూడా రాయితీ ఉంది. పచ్చిమిర్చి కూడా వేసుకోవచ్చు.

చంద్రారెడ్డి (పానగల్) దయాకర్‌రెడ్డి(పలివెల) : రుణమాఫీని ఎప్పటిలోగా పూర్తి చేశారు.
జేడీఏ: ప్రభుత్వం ఇప్పటికే రూ. 2లక్షల రుణమాఫీని పూర్తి చేసింది. త్వరలోనే రూ.2లక్షల పైగా రుణం తీసుకున్న రైతు లపైకూడా నిర్ణయం తీసుకొని మార్గదర్శకాలను విడుదల చేయ నుంది. అర్హులైన ప్రతి రైతుకు కటాఫ్ డేట్ ప్రకారం రుణమాఫీ వర్తిస్తున్నది.


ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీఏ శ్రవణ్ కుమార్

మహమ్మూద్ (కాశీవారిగూడెం): వరి పచ్చబడటం లేదు.
జేడీఏ: ప్రస్తుతం కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయి చల్లటి వాతావరణంతో పొలం పచ్చబడదు. దీని కోసం యాజమాన్య పద్ధతులు పాటించాలి. నాటు వేసి 15 రోజులు అయినందున చిలామిన్ జింక్ స్ప్రే చేయండి.
కొప్పుల అశోక్ రెడ్డి(కొత్తపేట) మిషన్‌తో నాట్లు వేయడం వల్ల వరి ఎర్రగా మారుతుంది.
జేడీఏ : 23 రోజుల కింద నాటు వేసినందున జింక్ వేయాలి. పొలంలో ఉన్న నీటిని ప్రతిరోజు ఉదయం బయటకు వదిలి వేయాలి. చలి ప్రభావంతో ఎర్రగా మారింది.

అనగంటి కృష్ణ (మునుగోడు) : ఏ సీజన్‌లో ఏ పంటలు వేయాలో రైతులకు అవగాహన కల్పించాలి
జేడీఏ : ప్రతి సీజన్‌లో ఏ పంటలు వేయాలనే దానిపై రైతు వేదికల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి మంగళవారం రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో రైతు వేదిక లకు వెళ్లే రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

బంగారు రవి(కోతులారం) : పత్తి దిగుబడి పెరగడానికి ఎలాంటి యాజమాన్య పద్ధతులు చేపట్టాలి.
జేడీఏ : ఒకేరకం విత్తనాలు కాకుండా ప్రభుత్వం అనుమతించిన విత్తనాలను వేస్తే దిగుబడి అధికంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో నాన్‌బీటీ లేదు. బూత్‌పూర్ వంటి ప్రాంతాల్లో కొందరు నకిలీ విత్తనాలను అంటగడుతారు. మంచి బీటీ విత్తనాలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయి.
రావిల శ్రీనివాస్ రెడ్డి (నంది పహాడ్) : విత్తన తయారీ కేంద్రంలో ఆయిల్‌పామ్ నర్సరీని ఏర్పాటు చేయాలి.
జేడీఏ: ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తుంది. 163 ఎకరాలు అక్కడ ఉన్నందున ఆయిల్ పామ్ నర్సరీని ఏర్పాటు చేయాలని కోరుతున్నందున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

వంగూరి వెంకటయ్య (మేళ్లదుప్పలపల్లి) : వరి దిగుబడి పెరగ డానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి. నిమ్మకు వేరు తెగుళ్ల నివారణకు ఏమి చేయాలి
జేడీఏ : పంటల దిగుబడి పెరగడానికి సూపర్‌తో పాటు డీఏపీ వేయాలి. పొట్ట దశలో యూరియా పోటాషియం వేయండి. 45 రోజుల తరువాత పిలకలు వేసే దశలో యూరియా వేయాలి. నిమ్మకు వేరు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సైడ్ చెట్టు పాదల్లో వేయడంతో పాటు ట్రైకోడెర్మావిరిడిని పశువుల ఎరువులతో కలిపి వేయాలి.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు

దేవరకొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ కవర్లు విక్రయించొద్దని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ అన్నారు. దేవరకొండ మున్సిపల్ పరిధిలో మటన్ దుకాణాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం నిషేధం ఉన్నట్లు తెలిపారు. పరిశుభ్రమైన ప్రాంతాల్లోనే మటన్ విక్రయాలు జరపాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లను జరిమానా విధించడంతో పాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అధికారులు శక్రూ నాయక్, రాజు రవి పాల్గొన్నారు.

దేవరకొండలో ఆపరేషన్ చబుత్ర

దేవరకొండలో బుధవారం రాత్రి 11.30, నుంచి 12-30 వరకు ఆపరేషన్ చబుత్రలో భాగంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించి నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపా రు. అర్థరాత్రి రోడ్డుపై తిరుగుతున్న 50 మం దిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు చె ప్పారు. ఎలాంటి పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత

దేవరకొండబాలుర ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు రవికుమార్, శ్రవణ్‌కుమార్ రూ.1,20,000 విలువ చేసే ప్యాన్లు, ఇన్వర్టర్ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన సమావేశంలో మునిసిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పూర్వ రవికుమార్, శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలకు తమ వంతుగా సహకారం మౌలిక వసతులు అందజేసామన్నారు. హెచ్‌ఎం శేరిపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు రవికుమార్, శ్రవణ్ కుమార్‌లను సన్మానించారు.

ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్న ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయా లని ఆ సంఘం నల్లగొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపిచంద్, కార్తీక్ కోరారు. గురువారం ఈ మేరకు కొండమల్లేపల్లి క్రాంతి జూని యర్ కళాశాలలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కంచి వారు మాట్లాడారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభలకు తరలిరావాలి

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28, 29, 30 తేదీల్లో నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే టీఎస్‌యూటీఎఫ్ 6వ విద్యా, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలకు తరలి రావాలని సంఘం జిల్లా కోశాధికారి రాజు అన్నారు. మండల కేంద్రంలో గురువారం మహాసభల పోస్టర్‌ను ఎంఈవో కొనమంచలి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మహా సభలకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, హాజరవుతున్నందున అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమం లో సంఘం మండలాధ్యక్షుడు ఎరనాగుల సైదులు, రేవల్లి రాజేష్, బి.శైలజ, జ్వాలా నరసింహారావు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


మిర్యాలగూడ రూరల్: కస్తూర్బా కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థినులు

నిడమనూరు, మిర్యాలగూడ రూరల్, హాలియా, దామరచర్ల దేవరకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిడమనూరు, మిర్యాలగూడ, హాలియా, దామరచర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎదుట విద్యార్థినులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు రెండు వారాలుగా సమ్మె బాట పట్టడంతో విద్యార్థులకు పాఠాలు బోధించేవారు కరువయ్యారని వాపోయారు. విద్యాలయాల్లో విద్యా బోధన జరగకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించి విధులకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారికి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. నిడమనూరులో సంఘం సాగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్ , వర్షిత్, సంతోష్, మిర్యాలగూడలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కమ్మంపాటి శంకర్, పతాని శ్రీను, ముడావత్ జగన్‌నాయక్, కుర్ర సైదా, పుట్ట సంపత్, ధీరావత్ వీరన్న హాలియాలో కార్యక్రమంలో వర్షిత్, సంతోష్, దామరచర్లలోముడావత్ జగన్ నాయక్, కుర్ర సైదా, ధీరావత్ వీరన్న, అజయ్, విష్ణు, రాహుల్, నాగరాజు, శ్రీధర్ దేవరకొండలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడిగె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


దేవరకొండ కస్తూర్బా కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు

పైప్‌లైన్ ఏర్పాటుకు సహకరించాలి : ఆర్డీవో

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): అక్కంపల్లి లిఫ్ట్ ప్రెజర్ మెన్ పైప్‌లైన్ ఏర్పాటుకు రైతులు సహకరించాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి కోరారు. పైప్‌లైన్‌లో ఏర్పాటులో భాగంగా 43 మంది రైతులతో కలిసి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఏపల్లి, గుడిపల్లి మండలంలోని 43 మంది రైతులకు సంబంధించి 4 ఎకరాల 23 గుంటల భూమిని సర్వే చేసినట్లు చెప్పారు రైతుల అధైర్య పడొద్దని 8 ఫీట్ల లోతులో పైప్‌లైన్ వేస్తామని. శాశ్వత పరిష్కారంగా పైప్‌లైన్ నిర్మిస్తామన్నారు. పైప్‌లైన్ పూర్తయిన తర్వాత చిలక మర్రి వద్ద స్టోరేజీ ఏర్పాటు చేసి అక్కడి నుంచి తిరిగి 43 మంది రైతు లతో పాటు ఇతర రైతులకు నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఈ నాగయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఏఈలు రైతులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి చేయడం అభినందనీయం



పీ.టీ.నగర్‌లో దివ్యాంగులకు దుప్పట్లు అందజేస్తున్న కృష్ణవేణి

చింతపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంక్షేమానికి ఆఫ్ వే హోం నిర్వాహకులు కృషి చేయడం అభినందనీయమని జిల్లా మహిళ, వృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి అన్నారు. మండ లంలోని గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్‌లో సీటీఆర్ (ఆఫ్‌వే హోం) ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని మహిళలతో పాటు వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆఫ్ వే హోం నిర్వాహకులు అనిల్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ మీనాక్షి, పీడీ సంతోష్‌కుమార్, కిరణ్, శ్రీనివాస్, యాదగిరి, ధనలక్ష్మి, చంద్రశేఖర్, నాయకులు పూరె లక్ష్మణ్, కొందూరు శ్రీనివాస్, మాస భాస్కర్, నిరంజన్‌గౌడ్, పరమేష్ పాల్గొన్నారు.

సమాచార హక్కుప్రచార సమితి కార్యదర్శిగా వెంకటేష్

చింతపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు ప్రచార సమితి కార్యదర్శిగా జిల్లా చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఏనుగుల వెంకటేష్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాట్రావత్ రాజు నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల సమస్యల సాధన కోసం కృషి చేయాలని ఆయన సూచించారు.

బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల పాట్లు


పెద్ద అడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద రోడ్డుపై నిల్చొన్న ప్రయాణికులు (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి, గుర్రంపోడు (ఆంధ్రజ్యోతి): .రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభించినప్పటి నుంచి ఆర్టీసీ బస్సులకు ఆదరణ పెరిగింది. అయితే పెద్ద అడిశర్లపల్లి మండ లంలోని జాతీయ రహదారి అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద, గుర్రంపోడు మండల కేంద్రంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రయా ణికులు ఎండైనా, వానైనా రోడ్డుపై ప్రయాణికులు నిలబడి ఉండాల్సిందే. రెండు మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు ఉన్నాయి. నిత్యం ఉద్యోగులు, విద్యార్థులు బస్సులో వస్తూపోతూ ఉంటారు. కాగా బస్సుల కోసం రోడ్డు పక్కన దుకాణాల ముందు లగేజీతో నిలబడాల్సి రావడం, అడ్డుగా ఉన్నారంటూ దుకాణా యజమానులు ఈసడించుకుంటున్నారు. గతంలో అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద బస్‌షెల్టర్ ఉండేది. హైదరాబాద్‌కు హెచ్ ఎండబ్ల్యూ పైప్‌లైన్ బస్‌షెల్టర్ గుండా వెళ్లడంతో దానిని పూర్తిగా తీసివేసిన అధికారులు తిరిగి నిర్మించడం మరిచిపోయారు. ఆర్టీసీ, జాతీయ రహదారి సంస్థ అధికారులు, ఇటు పం చాయతీ అధికారులు స్పందించి అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద బస్‌షెల్టర్ నిర్మించి టాయిలెట్ ఏర్పా టు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

● నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో తైక్వాండో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రీడా పోటీలు, మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మూడు జిల్లాల నుంచి తైక్వాండో క్రీడాకారులు హాజరై క్రీడా ప్రతిభను కనబర్చారు. వివిధ కేటగి రిల్లో బాల, బాలికలు తలపడ్డారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలు ఎంపిక చేశారు. మేకల అభినవ్ స్టేడియంలో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ జిల్లాస్థాయి పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల, కార్యద ర్శులు యూనుస్ కమాల్, నారాయణ, ప్రణీత్, నజీర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం, (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో నిర్వహించిన సీఎంకప్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో శాలిగౌరారం బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధించింది. క్రీడాకారులను శాలిగౌరారం జడ్పీస్కూల్ పీఈటీ, మండల క్రీడల ఇన్‌చార్జి జ్యోతిని మండల ప్రత్యేక అధికారి మన్యా నాయక్, ఎంఈవో మందుల సైదులు, ఎంపీవో పద్మ అభినందించారు.

అమిత్‌షా మనువాద ఆలోచనలను మానుకోవాలి



హాలియాలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

దామరచర్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షా తన మనువాద ఆలోచనలను మానుకోవాలని మాదిగ సంఘాల మహాకూటమి నాయకుడు పోలెపల్లి ఉదయ్ కుమార్, పోకల రవికుమార్ అన్నారు. అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మండల కేంద్రంలో వారు నల్లబ్యాడ్జీలతో రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కొమ్ము రాజేష్, యాం పొంగు ప్రసాద్, శ్రీధర్, కొమ్ము రమేష్, గద్దల శ్రీను, భూ రాజు, లక్ష్మయ్య, భాస్కర్, రాజశేఖర్, సైదులు, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, నాగమహేష్ పాల్గొన్నారు.

అమిత్ షా ను బర్తరఫ్ చేయాలి

మిర్యాలగూడ టౌన్ (ఆంధ్రజ్యోతి): అమిత్‌షా ను కేంద్ర కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు డిమాండ్ చేశారు. గురువారం రాజీవ్ భవన్‌లో మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడటం సరి కాదన్నారు. సమావేశంలో నాయకులు జంగిలి లింగయ్య, ఉగ్గిడి అంజయ్య, చాంద్‌పాషా, సురేష్ పాల్గొన్నారు.

● హాలియా (ఆంధ్రజ్యోతి): కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం గురువారం హాలియాలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను జిల్లా ఉపాధ్యక్షుడు దైద శ్రీను, దుబ్బ రాంచంద్రయ్య, కోరే రమేష్, కారంపూడి ధనమ్మ, నాగార్జున, దోరేపల్లి మల్లయ్య, బషీర్, జగదీష్, వెంకన్న, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల్లో ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి చెకుముకి పోటీల్లో కొండమల్లేపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు నందిని, శివాని, సోని తృతీయ స్థానంలో నిలిచి ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా గురువారం ప్రతిభ కనర్చిన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని హెచ్‌ఎం ఆకాంక్షించారు.

హాలియాలో సెమీ క్రిస్మస్ వేడుకలు


హాలియాలో కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

హాలియా, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): హాలియా మున్సిపాలిటీ పేరూరు రోడ్డులోని కె.ఎస్ గార్డెన్స్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను నాగార్జునసాగర్ నియోజకవర్గ పాస్టర్స్ పెలోషిప్ అధ్యక్షుడు నంద్యాల ఎలీషారావు అధ్వర్యంలో ఆరు మండలాలల ఫెలోషిప్ కమిటీ ప్రార్థన సహకారంతో సెమీ క్రిస్మస్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆంద్రూస్, పోలే డేవిడ్, పెదమాము రాజు, జంగాల సైదులు, గడుసు రవికుమార్, చంటి, డేవిడ్ నాయక్, కందుల సామేలు, పల్లపు సూర్యనారాయణ, ఏసన్న, ఏసుచరణ్, అలుగుల లక్ష్మారెడ్డి, మేదరి రాజుపాల్, మోషే, కోట మిల్కీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికులా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన నల్లగొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ కమిటీని గురువారం జిల్లాకేంద్రంలో సన్మానించారు. యువజన కాంగ్రెస్‌లో పనిచేసిన వారు కాంగ్రెస్ పార్టీలో ఉన్నత స్థానాలకు ఎదిగారని మంత్రి కోమటిరెడ్డి కూడా యువజన కాంగ్రెస్‌లో పనిచేశారని గుర్తుచేశారు. సమావేశంలో వంగూరి లక్ష్మయ్య జూకూరి రమేష్, కత్తుల కోటి, గడ్డం అనూప్ రెడ్డి, జూలకంటి సైదిరెడ్డి, మామిడి కార్తీక్, నాగరాజు, జహంగీర్, సతీష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్ట్

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా ఆ సంఘం నాయకులను గురువారం ఎక్కడికక్కడే అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు జంగాల లక్ష్మమ్మ, పెయ్యల గీతలు మాట్లాడుత ఎస్సీ వర్గీకరణను చేపట్టాలని నిర్ణయం సరైందికాదని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో మీసాల సైదులు, పోతురాజు లింగయ్య, జంగాల సైదయ్య, సత్రశాల ఏడుకొండలు, పెయ్యల చిన్న అంజి పాల్గొన్నారు.

● దామరచర్ల-(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ముట్టడికి బయల్దేరిన మాలమహానాడు నాయకులను వాడపల్లి పోలీసులు గురు వారం ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బైరం నర్సయ్య, తాళ్లపల్లి విజయ్, బైరం బాలగురవయ్య, బైరం శ్యామ్‌సుందర్ సైదులు ఉన్నారు.


దామరచర్లలో అరెస్టు అయిన మాలమహానాడు నాయకులు